మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

మంగళవారం TUESDAY 12-5-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 ‖ సంచిక: 313 Issue: 313

Circulated to Telangana
Published from Jagitial


12 మే 2026 - మంగళవారంశ్రీ పరాభవ నామ సంవత్సరంఉత్తరాయణం - వసంత ఋతువువైశాఖ మాసం - కృష్ణపక్షంసూర్యోదయం - తె. 5:49సూర్యాస్తమయం - సా. 6:36తిథి దశమి మ. 2:46 వరకుతరువాత ఏకాదశిసంస్కృత వారంభౌమ వాసరఃనక్షత్రంపూర్వాభాద్ర రా. 1:04ం వరకుతరువాత ఉత్తరాభాద్రయోగంవైధృతి రా. 11:05 వరకుకరణంవిష్టి మ. 2:46 వరకు బవ రా. 2:14ం వరకువర్జ్యంఉ. 7:49 నుండి ఉ. 9:24 వరకుదుర్ముహూర్తంఉ. 8:22 నుండి ఉ. 9:13 వరకురా. 11:05 నుండి రా. 11:49 వరకురాహుకాలంమ. 3:24 నుండి సా. 5:00 వరకుయమగండంఉ. 9:00 నుండి ఉ. 10:36 వరకుగుళికాకాలంమ. 12:12 నుండి మ. 1:48 వరకుబ్రహ్మముహూర్తంతె. 4:13 నుండి తె. 5:01 వరకుఅమృత ఘడియలుసా. 5:20 నుండి సా. 6:55 వరకుఅభిజిత్ ముహూర్తంఉ. 11:47 నుండి మ. 12:38 వరకుగమనిక: "ం" అనగా మరుసటి రోజున

# సీఎం వెరీ సీరియస్

**భగీరథ్ కేసు వివరాలివ్వండి.. విచారణకు సిట్ ఏర్పాటు చేయండి**

## డీజీపీకి రేవంత్ రెడ్డి ఆదేశాలు



హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి భగీరథ్ వ్యవహారంపై సీఎం రేవంత్ రెడ్డి సీరియస్ అయ్యారు. మే 8వ తేదీన బాధితురాలు ఫిర్యాదు చేస్తే జాప్యం ఎందుకు చేశారంటూ పోలీసులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కేసు నమోదైనా దర్యాప్తు ఎందుకు చేయటం లేదని ఫైరయ్యారు. దీంతో డీజీపీ సీవీ ఆనంద్ కేసు వివరాలను సీఎం రేవంత్ రెడ్డికి వివరించారు. డీజీపీ సీవీ ఆనంద్ స్పందిస్తూ.. గత కొన్ని రోజులుగా ప్రధానమంత్రి నరేంద్ర మోడీ పర్యటన నిమిత్తం తరువాయి 2 వ పేజీలో...



# పరారీలో బండి భగీరథ్

## కచ్చితంగా పట్టుకుంటాం.. సిట్ చీఫ్ రితిరాజ్

హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): కేంద్ర మంత్రి బండి సంజయ్ కొడుకు, పోక్సో కేసు నిందితుడు బండి భగీరథ్ పరారీలో ఉన్నాడని సిట్ చీఫ్‌గా ఉన్న రితిరాజ్ తెలిపారు. సోమవారం ఆమె పేట్ బషీరాబాద్ ఏసీపీ, ఇన్‌స్పెక్టర్లతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ కేసుకు సంబంధించి ఇప్పటికే ఉన్న వివరాలను తాను చదివానని.. మరింత లోతుగా దర్యాప్తు చేస్తున్నట్లు వివరించారు. పేట్ బషీరాబాద్ పోలీస్ స్టేషన్‌లో 684/2026 నంబర్ ఎఫ్ఐఆర్ నమోదైనట్లు చెప్పారు. ఈ కేసులో ఇప్పటివరకు ఏమేం జరిగాయి అనేది పరిశీలించామని.. ఈ ప్రక్రియ కొనసాగుతుందని వెల్లడించారు. పోక్సో కేసులో చట్టం ప్రకారం ఏమేం కేసులు చేయాలి, ఎలాంటి ఆధారాలు సేకరించాలి అనేది చూస్తామని తరువాయి 2 వ పేజీలో...



# చమురు మంటలు

## బ్యారెల్‌పై 2.67 శాతం పెరుగుదల

లండన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్, ఇరాన్ మధ్య నెలకొన్న విభేదాలు ప్రపంచ చమురు ధరలకు ఆజ్యం పోస్తున్నాయి. అమెరికా ఏకపక్షంగా పంపిన శాంతి ప్రతిపాదనపై ఇరాన్ ఇచ్చిన సమాధానాన్ని అధ్యక్షుడు ట్రంప్ అంగీకారయోగ్యం కాదని అని కొట్టిపారేయడంతో అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు సోమవారం ఒక్కసారిగా ఎగబాకాయి. ట్రంప్ వ్యాఖ్యల అనంతరం సరఫరా ఆటంకాలు మరింత పెరగొచ్చన్న ఆందోళనతో బ్రెంట్ క్రూడ్ ఫ్యూచర్స్ 2.67 శాతం పెరిగి బ్యారెల్‌కు 103.99 డాలర్లకు చేరుకుంది. అదే విధంగా అమెరికాకు చెందిన వెస్ట్ టెక్సాస్ ఇంటర్మీడియట్ (డబ్ల్యూటీఐ) కూడా 2.35 శాతం ఎగిసి 97.66 వద్ద నమోదయ్యింది. గత వారంలో యుద్ధం ముగుస్తుందన్న ఆశలతో ధరలు కొంత తగ్గినప్పటికీ.. తాజా పరిణామాలతో మార్కెట్ మళ్ళీ వేడెక్కింది.



# 17 రాష్ట్రాలు, 5 యూటీల్లో ఎస్ఐఆర్

## త్వరలో 40 కోట్ల ఓటర్ల ప్రక్రియ

న్యూఢిల్లీ: రాబోయే కొద్దిరోజుల్లో ఓటర్ల జాబితా ప్రత్యేక సవరణ (ఎస్ఐఆర్) మూడవ దశను ప్రారంభిస్తామని ఎన్నికల సంఘం అధికారులు తెలిపారు. 40 కోట్ల మంది ఓటర్లను కవర్ చేస్తూ, మిగిలిన 17 రాష్ట్రాలు, 5 కేంద్ర పాలిత ప్రాంతాల్లో 'ఎస్ఐఆర్' ఉంటుందని వెల్లడించారు. ఇటీవల ఐదు రాష్ట్రాల ఎన్నికలు జరిగాయి. ఈ నేపథ్యంలో 'ఎస్ఐఆర్' ప్రక్రియ తాత్కాలికంగా నిలిచిపోయింది. ఫలితాలు వెలువడిన నేపథ్యంలోతరువాయి 2 వ పేజీలో...



# సీజ్.. ఫైర్

## తాత్కాలిక కాల్పుల విరమణ ఉల్లంఘన

## పశ్చిమాసియాలో మళ్లీ ఉద్రిక్తతలు.. 2,500 మందికి పైగా భారతీయులు తరలింపు

హర్మూజ్ జలసంధి సమీపంలో అమెరికా, ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు మరోసారి తారాస్థాయికి చేరుకున్నాయి. ఇరు దేశాల మధ్య కుదిరిన తాత్కాలిక కాల్పుల విరమణ ఒప్పందం ఉల్లంఘనకు గురైందని, ఇరాన్ నౌకలను అమెరికా సీజ్ చేయడం, అలాగే ఇరాన్ హెచ్చరికలతో గల్ఫ్ ప్రాంతంలో యుద్ధ వాతావరణం నెలకొంది. అమెరికా దాడులు చేస్తే ఊరుకునేది లేదని, తమ సైనిక స్థావరాలపై విరుచుకుపడతామని ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ హెచ్చరించాయి.



టెహ్రాన్: ఇరాన్ ప్రతిపాదనలను తిరస్కరించిన డోనాల్డ్ ట్రంప్, ఒప్పందం కుదరకపోతే బాంబుల వర్షం కురుస్తుందని హెచ్చరించారు. ఇరాన్ నుంచి మిస్సైల్స్, డ్రోన్ దాడులు జరిగే ప్రమాదం ఉందని యూఏఈ తన ఎయిర్ డిఫెన్స్ సిస్టమ్‌ను యాక్టివేట్ చేసింది. పశ్చిమాసియాలో మరోసారి ఉద్రిక్తతలు పెరుగుతోన్న నేపథ్యంలో అప్రమత్తమైన కేంద్ర ప్రభుత్వం.. అక్కడ తరువాయి 2 వ పేజీలో...



# రూపాయి తంటాలు

## దారుణంగా పడిపోయిన విలువ

ముంబై: భారత రూపాయి విలువ అంతర్జాతీయ మార్కెట్‌లో కోలుకోలేని విధంగా దెబ్బతిన్నది. సోమవారం ట్రేడింగ్‌లో డాలరుతో పోలిస్తే రూపాయి ఏకంగా 83 పైసలు క్షీణించి 95.31 వద్ద స్థిరపడింది. గత మార్చి నెల తర్వాత ఈ స్థాయిలో రూపాయి పడిపోవడం ఇదే మొదటిసారి. ప్రధానంగా పశ్చిమాసియాలో కొనసాగుతున్న యుద్ధ వాతావరణం, తద్వారా ముడిచమురు ధరలు పెరగవచ్చనే ఆందోళనలు ఇన్వెస్టర్లను కలవరపెట్టాయి. ఇంధన ధరల పెరుగుదలపై స్వయంగా ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ప్రస్తావించడంతో, అది దేశీయ కరెన్సీపై తీవ్ర ఒత్తిడిని పెంచిందని ట్రేడ్ నిపుణులు విశ్లేషిస్తున్నారు.




**బంగారం-వెండి ధరలు (హైదరాబాద్‌లో)**

| | |
|---|---|
| (గ్రాము-24 క్యారెట్స్): | రూ.15,093 |
| వెండి (కిలో): | రూ.2,70,000 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,055 |



# 1100 కోట్లతో విద్యాకిట్లు

**9 వస్తువులతో పంపిణీ చేస్తాం.. స్కూల్, కాలేజీ విద్య అనుసంధానం**

## బ్రేక్‌ఫాస్ట్‌గా పాలు, రాగి జావ.. సీఎం రేవంత్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): ప్రజాపాలన ప్రగతి ప్రణాళికలో భాగంగా తెలంగాణ ప్రభుత్వం విద్యా వారోత్సవాలు నిర్వహిస్తుండగా.. తాజాగా హైదరాబాద్ ఎల్బీ స్టేడియంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించి.. మాట్లాడారు. చదువు ద్వారానే సమాజంలో మార్పు తీసుకురాగలమని.. అందుకే తెలంగాణ విద్యా శాఖను మంత్రులకు కేటాయించకుండా తానే స్వయంగా పర్యవేక్షిస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే రాష్ట్రంలో విద్యా వ్యవస్థను బలోపేతం చేసేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు చెప్పారు. అదే తరువాయి 2 వ పేజీలో...

**తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా**

# గద్వాల విజయలక్ష్మి

## సభ్యులుగా శ్రీకాంతాచారి తల్లి, చాకలి ఐలమ్మ మనవరాలు

**రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ**

తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్‌కు రేవంత్ రెడ్డి సర్కార్ కొత్తగా నియామకాలను చేపట్టింది. రాష్ట్రంలో మహిళా హక్కుల పరిరక్షణ, మహిళా సంక్షేమ కార్యక్రమాలను పర్యవేక్షించడం కోసం తెలంగాణ మహిళా కమిషన్‌కు ఛైర్‌పర్సన్, సభ్యులను నియమించింది. తెలంగాణ రాష్ట్ర మహిళా కమిషన్ ఛైర్‌పర్సన్‌గా గ్రేటర్ హైదరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ మేయర్ గద్వాల విజయలక్ష్మిని నియామకం చేస్తున్నట్లు తెలిపింది.



హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): అదే సమయంలో కమిషన్ సభ్యులుగా ప్రభుత్వం పలువురు మహిళలకు అవకాశం ఇచ్చింది. తెలంగాణ ఉద్యమం, సామాజిక సేవ, మహిళా హక్కుల కోసం పనిచేసిన వారికి ప్రాధాన్యం ఇచ్చినట్లు తెలుస్తోంది. తెలంగాణ ఉద్యమంలో అమరుడైన శ్రీకాంతాచారి తల్లి కాసోజు శంకరమ్మకు.. మహిళా కమిషన్ సభ్యురాలిగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం నియమించింది. రాష్ట్ర సాధన ఉద్యమ తరువాయి 2 వ పేజీలో...




# మార్కెట్లు నేలచూపులు

ముంబై: దేశీయ స్టాక్ మార్కెట్లు సోమవారం భారీ నష్టాలను చవిచూశాయి. ఇన్వెస్టర్ల సెంటిమెంట్ దెబ్బతినడంతో అమ్మకాల ఒత్తిడి పెరిగి సెన్సెక్స్ ఏకంగా 1,312 పాయింట్లు పతనమై 76,015 వద్ద ముగిసింది. అటు నేషనల్ స్టాక్ ఎక్స్ఛేంజ్ సూచీ నిఫ్టీ కూడా 360 పాయింట్లను కోల్పోయి 23,815 వద్ద స్థిరపడింది. యుద్ధ భయాలు, అంతర్జాతీయ మార్కెట్లలో అనిశ్చితి వల్ల విదేశీ పోర్ట్‌ఫోలియో ఇన్వెస్టర్లు తమ పెట్టుబడులను వెనక్కి తీసుకోవడం మార్కెట్ల పతనానికి ప్రధాన కారణంగా నిలిచింది.

## విశ్వవాణి



నార్వేలోని ఓ పట్టణం కొండల మధ్య ఉండటంతో చలికాలంలో వెలుతురు దాదాపు 6 నెలలు అందదు. దీంతో కొండల మధ్య భారీ అద్దాలను ఏర్పాటు చేశారు. సూర్యుడు ఉదయించగానే ఆ అద్దాలపై కిరణాలు పడి ఆ పట్టణంలోకి వెలుతురు వచ్చేలా ఏర్పాటు చేశారు.



# మళ్లీ వర్క్ ఫ్రమ్ హోమ్!

ప్రధాని మోదీ ఇంధన వినియోగాన్ని తగ్గించి, సాధ్యమైనంత వరకు రిమోట్ వర్క్‌ను ప్రోత్సహించాలని సూచించడంతో భారత కార్పొరేట్ రంగంలో మళ్లీ వర్క్ ఫ్రమ్ హోమ్ చర్చ మొదలైంది. ఈ క్రమంలో కేంద్ర కార్మిక శాఖకు ఐటీ ఉద్యోగుల సంఘం నైట్స్ (నైట్స్) లేఖ రాసింది. ఐటీ, ఐటీఈఎస్ రంగాల్లో సాధ్యమైన ఉద్యోగాలకు తాత్కాలికంగా తప్పనిసరి వర్క్ ఫ్రమ్ హోమ్ అమలు చేయాలని మంత్రి మాన్సుఖ్ మాండవియాను కోరింది. కోవిడ్ సమయంలో భారత ఐటీ రంగం రిమోట్ వర్క్ మోడల్‌ను విజయవంతంగా అమలు చేసిందని నైట్స్ అధ్యక్షుడు హర్‌ప్రీత్ సింగ్ సలూజా అన్నారు. క్లౌడ్ టెక్నాలజీ, సైబర్ సెక్యూరిటీ, డిజిటల్ కొలాబరేషన్ టూల్స్ సహాయంతో కంపెనీలు కార్యకలాపాలను సజావుగా కొనసాగించాయి. మెట్రో తరువాయి 2 వ పేజీలో...



# విజయ్‌కు జెడ్ ప్లస్ భద్రత

## కేంద్రం కీలక నిర్ణయం


న్యూఢిల్లీ/చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రి జోసెఫ్ విజయ్‌కు కేంద్ర ప్రభుత్వం జెడ్ ప్లస్ భద్రత కల్పించింది. సోమవారం ఉదయం నుంచి విజయ్‌కు జడ్ ప్లస్ కేటగిరీ సెక్యూరిటీ అమల్లోకి వచ్చింది. ఎంపీ5 -2 వ పేజీలో...

# పోలవరం.. టీజీ గరం

## పనులు ఆపాలని పీపీఏకు తెలంగాణ లేఖ

## భద్రాచలం ముంపు ప్రాంతాలపై తీవ్ర ఆందోళన.. తెలుగు రాష్ట్రాల మధ్య మళ్లీ వివాదం

హైదరాబాద్/అమరావతి, మే 11 (ఈవార్తలు): ఏపీ, తెలంగాణ మధ్య మరోసారి పోలవరం ప్రాజెక్టు వివాదం నెలకొంది. పోలవరం ఫేజ్ 2 పనులపై తెలంగాణ సర్కార్ అభ్యంతరం చెప్పింది. ఈ పనులను వెంటనే నిలిపివేయాలని పోలవం ప్రాజెక్ట్ అథారిటీకి తెలంగాణ సర్కార్ లేఖ రాసింది. ప్రాజెక్టు ముంపు ప్రాంతాలకు సంబంధించి పూర్తి స్థాయి సర్వే పూర్తి అయ్యే వరకు పోలవరంలో ఎలాంటి నిర్మాణాలు చేపట్టవద్దని తేల్చి చెప్పింది. ఈ క్రమంలోనే భద్రాచలం సహా పలు ముంపు ప్రభావిత ప్రాంతాలపై తెలంగాణ ప్రభుత్వం తీవ్ర ఆందోళన వ్యక్తం చేసింది. ఈ క్రమంలోనే 36 వాగుల డ్రైనేజ్ ప్రభావంపైనా అధ్యయనం చేయాలని తెలంగాణ ప్రభుత్వం డిమాండ్ చేసింది. ఈ క్రమంలోనే తరువాయి 2 వ పేజీలో...



## రాశి ఫలాలు

12.5.2026

మేషం: ఆత్మీయుల నుంచి ముఖ్య సమాచారం అందుతుంది. ఇంటాబయట పరిస్థితులు అనుకూలిస్తాయి. వృత్తి వ్యాపారాల్లో పురోగతి సాధిస్తారు. సన్నిహితుల సహాయంతో నూతన కార్యక్రమాలు చేపట్టి సకాలంలో పూర్తి చేస్తారు. స్థిరాస్తి వివాదాలకు సంబంధించినవి కొలిక్కి వస్తాయి. ఉద్యోగాలలో బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు.

వృషభం: వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది. ఆర్థిక లావాదేవీలు మందకొడిగా సాగుతాయి. ఆరోగ్య విషయంలో అప్రమత్తంగా వ్యవహరించాలి. ముఖ్యమైన వ్యవహారాలు శ్రమ అనంతరం పూర్తవుతాయి. వ్యాపారాలలో సొంత నిర్ణయాలు అంతగా కలిసిరావు. నిరుద్యోగయత్నాలు మందగిస్తాయి. వృత్తి ఉద్యోగాలలో శ్రమ అధికమవుతుంది.

మిధునం: దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. వ్యాపార వ్యవహారాలు అంతంత మాత్రంగా సాగుతాయి. మిత్రులతో మాటపట్టింపులు కలుగుతాయి. చేపట్టిన వ్యవహారాలు నత్తనడకన సాగుతాయి. ఆరోగ్య విషయంలో కొంత జాగ్రత్త వహించాలి. ఉద్యోగమున పని ఒత్తిడి అధికమవుతుంది.

కర్కాటకం: ఇంటా బయట పరిస్థితులు అనుకూలిస్తాయి. చేపట్టిన పనులలో అప్రయత్న కార్యసిద్ధి కలుగుతుంది. నిరుద్యోగుల కలలు సహకారం అవుతాయి. సమాజంలో ప్రముఖులతో పరిచయాలు పెరుగుతాయి. వ్యాపారాలలో తగినంత లాభాలు అందుకుంటారు. ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది.

సింహం: ఆకస్మిక ధనలాభం కలుగుతుంది. స్థిరాస్తి ఒప్పందాలు వాయిదా పడతాయి. దైవ సేవా కార్యక్రమాల్లో పాల్గొంటారు. గృహ వాతావరణం చికాకుగా ఉంటుంది. నూతన కార్యక్రమాలు ప్రారంభించిన అప్రయత్నంగా పూర్తి చేస్తారు. వ్యాపారాలలో కొంత మెరుగైన పరిస్థితులు ఉంటాయి. ఉద్యోగాలలో అధికారుల ఆదరణ పెరుగుతుంది.

కన్య: దూరప్రయాణ సూచనలున్నవి. నూతన ఋణ ప్రయత్నాలు చేస్తారు. మిత్రుల నుంచి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. ముఖ్యమైన వ్యవహారాలలో ఆలోచనలు స్థిరంగా ఉండవు. చేపట్టిన పనులు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. వ్యాపారపరంగా తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. ఆర్థికంగా స్వల్ప ఇబ్బందులు ఉంటాయి.

తుల: పాత ఋణాలు తీర్చడానికి నూతన ఋణాలు చేస్తారు. ఆర్థిక పరిస్థితి గందరగోళంగా ఉంటుంది. బంధుమిత్రుల వలన ఊహించని సమస్యలు కలుగుతాయి. దూర ప్రయాణాలు వాయిదా వేయుట మంచిది. అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. వ్యాపారాలు మందకోడిగా సాగుతాయి. నిరుద్యోగులకు శుభవార్తలు అందుతాయి.

వృశ్చికం: చేపట్టిన పనుల్లో విజయం సాధిస్తారు. నూతన వస్తు వాహనాలు కొనుగోలు చేస్తారు. కుటుంబ సభ్యులతో పుణ్యక్షేత్రాలు దర్శించుకుంటారు వృత్తి వ్యాపారాలు మరింత అనుకూలంగా సాగుతాయి. వృత్తి వ్యాపారాలలో మీ శ్రమకు తగిన ఫలితం లభిస్తుంది. ఉద్యోగమున బాధ్యతలు సమర్థవంతంగా నిర్వర్తిస్తారు.

ధనస్సు: ఆర్థిక పరిస్థితి కొంత నిరాశ కలిగిస్తుంది. ముఖ్యమైన పనులు వాయిదా వెయ్యటం మంచిది. వృత్తి వ్యాపారాలలో శ్రమాధిక్యత పెరుగుతుంది. కుటుంబ సభ్యులతో మాట పట్టింపులు కలుగుతాయి. నిరుద్యోగ ప్రయత్నాలు మందగిస్తాయి. ఉద్యోగమున అధికారులతో ఓర్పుగా వ్యవహరించడం మంచిది.

మకరం: ఇంటాబయట బాధ్యతలు సమర్థవంతంగా నిర్వహిస్తారు. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. వ్యాపార విస్తరణకు ప్రయత్నాలు అనుకూలిస్తాయి. మొండి బకాయిలు వసూలవుతాయి. దైవ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. ఆర్థిక అనుకూలత కలుగుతుంది.

కుంభం: కొన్ని పనులు శ్రమతో కానీ పూర్తి కావు. ఇతరులతో మాట పట్టింపులు తప్పవు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. చేపట్టిన వ్యవహారాలు ముందుకు సాగక నిరాశ పెరుగుతుంది. వ్యాపార ఉద్యోగాలు కొంత సామాన్యంగా సాగుతాయి.

మీనం: చేపట్టిన పనులు సకాలంలో పూర్తవుతాయి. దైవ కార్యక్రమాలు నిర్వహిస్తారు. బంధుమిత్రులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. దూరపు బంధువుల నుంచి శుభవార్తలు అందుతాయి. నూతన వాహనం కొనుగోలు చేస్తారు. వ్యాపారాలలో అవాంతరాలు తొలగుతాయి. ఉద్యోగ వాతావరణం ప్రశాంతంగా ఉంటుంది.

# సీజ్.. ఫైర్

**మొదటి పేజీ తరువాయి**

ఉన్న లక్షలాది మంది భారతీయుల భద్రతపై దృష్టిసారించింది. విదేశాంగ శాఖ 24/7 వార్ రూమ్‌ను క్రియాశీలం చేసింది. పరిస్థితి అస్థిరంగా ఉన్నప్పటికీ వారిని స్వదేశానికి తీసుకొచ్చే ప్రయత్నాలు జరుగుతున్నాయని సోమవారం జరిగిన అంతర్- మంత్రిత్వ శాఖల సమావేశంలో అధికారులు తెలిపారు. అంతేకాదు, నౌకల సురక్షిత రవాణాకు ప్రయత్నాలు జరుగుతున్నాయని అధికారులు ధ్రువీకరించారు. అక్కడ చిక్కుకున్న వారి కుటుంబాలకు సమాచారాన్ని అందించేందుకు రాష్ట్ర ప్రభుత్వాలతో నిరంతరం సంప్రదింపులు జరపడానికి విదేశాంగ శాఖ నిరంతరం పనిచేస్తోందని అదనపు కార్యదర్శి అసీమ్ ఆర్ మహజన్ తెలిపారు. కొన్ని ప్రాంతాలో ఆంక్షలు కొనసాగుతున్నప్పటికీ, మొత్తం మీద కనెక్టివిటీ మెరుగుపడుతోందని పేర్కొన్నారు. టెహ్రాన్‌లోని భారత రాయబార కార్యాలయం 2,549 మంది భారత పౌరులను ఇరాన్ నుంచి తరలించడంలో సహకారం అందించినట్టు చెప్పారు. ప్రస్తుతం భారతీయులు ఇరాన్‌కు అన్ని రకాల ప్రయాణాలను నివారించాలని సూచించారు. 'యూఏఈ గగనతలం తెరిచింది.. భారత్, యూఏఈ విమానయాన సంస్థలు తదేశంలోని వివిధ గమ్యస్థానాలకు విమానాలను నడుపుతున్నాయి. సౌదీ అరేబియా, ఒమన్‌లోని విమానాశ్రయాల నుంచి కూడా విమానాలు నడుస్తున్నాయి. ఖతార్ గగనతలం పాక్షికంగా తెరిచి ఉంది.. ఎయిర్ ఇండియా, ఎయిర్ ఇండియా ఎక్స్‌ప్రెస్, ఇండిగో, ఖతార్ ఎయిర్‌వేస్ విమానాలను నడుపుతున్నాయి. కువైట్, బహ్రెయిన్ గగనతలాలు తెరిచి ఉన్నాయి. ఇరాక్ గగనతలం పరిమిత విమాన కార్యకలాపాలతో తెరిచి ఉంది. ఇరాన్ గగనతలం పాక్షికంగా తెరిచి ఉంది.. భారత పౌరులు ఇరాన్‌కు ప్రయాణాలు నిలిపివేయాలని సూచించాం.. ఇప్పటికే అక్కడ ఉన్నవారిని మా రాయబార కార్యాలయం మద్దతుతో తిరిగి రావాలని కోరాం.. ఇప్పటివరకు, టెహ్రాన్‌లోని మా రాయబార కార్యాలయం భూ సరిహద్దు మార్గాల ద్వారా 2,549 మంది భారత పౌరులు ఇరాన్ నుంచి బయటకు రావడానికి సౌకర్యం కల్పించింది. ఇజ్రాయెల్ గగనతలం తెరిచి ఉంది. పరిమిత విమాన కార్యకలాపాలు తిరిగి ప్రారంభమయ్యాయి' అని అసీమ్ మహాజన్ అన్నారు. హర్మూజ్ సహా ఇరాన్ సముద్ర జలాల్లో ఘర్షణ వాతావరణం ఉన్నప్పటికీ, కొద్ది రోజులుగా భారతీయ నౌకల రాక పోకలు సజావుగా సాగుతున్నట్టు పోర్ట్స్ అండ్ షిప్పింగ్ మంత్రిత్వ శాఖ నివేదించింది. గత మూడు రోజులుగా భారత జెండాతో ఉన్న ట్యాంకర్లు, భారత్‌కు చమురు తీసుకొచ్చే విదేశీ జెండాతో ఉన్న వాణిజ్య నౌకలు, భారతీయ నావికులకు గానీ సంబంధించి ఎలాంటి సంఘటన జరగలేదని పేర్కొంది.

### యూఏఈ నుంచి భారతీయుల తరలింపు అబద్ధం

సామాజిక మాధ్యమాల్లో వైరల్ అవుతున్న రెండు కీలక అంశాలపై భారత ప్రభుత్వం స్పందించి స్పష్టతను ఇచ్చింది. యూఏఈ నుంచి భారతీయుల తరలింపు ప్లాన్, రఫేల్ యుద్ధ విమానాల నష్టానికి సంబంధించిన వార్తలన్నీ పూర్తిగా నిరాధారమైనవని కేంద్రం ప్రకటించింది. యూఏఈలోని ఫుజైరా పోర్ట్ ద్వారా లక్షలాది మంది భారతీయ కార్మికులను తరలించేందుకు భారత్, యూఏఈ దేశాలు ఒక ఒప్పందం చేసుకుంటున్నాయని.. ఇందుకు సంబంధించిన ప్రణాళికలు సిద్ధం అయ్యాయని ఇటీవల కొన్ని ప్రముఖ దినపత్రికల్లో కథనాలు వచ్చాయి. ఈ వార్తలను ఎంఈఏ ఖండించింది. "ఈ వార్తల్లో ఎలాంటి వాస్తవం లేదు. భారతీయుల తరలింపునకు సంబంధించి ఎలాంటి చర్చలు జరగడం లేదు. అలాంటి ప్రణాళికలు ఏవీ లేవు" అని అధికారులు స్పష్టం చేశారు. సామాజిక మాధ్యమాల్లో ప్రచారం అవుతున్న ఈ కథనాలను ఎవరూ నమ్మవద్దని, ఇవన్నీ కేవలం ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలేనని 'ఫేక్ న్యూస్ అలర్ట్' జారీ చేసింది. మరోవైపు విదేశీ వ్యవహారాల శాఖ అధికారిక ప్రతినిధి రణధీర్ జైస్వాల్‌కు సంబంధించిన ఒక డీప్‌ఫేక్ వీడియో ఇంటర్నెట్‌లో హల్‌చల్ చేస్తోంది. ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) సాయంతో రూపొందించిన ఈ వీడియోలో.. భారత్ తన రఫేల్ యుద్ధ విమానాలను కోల్పోయిందని ఆయన ఒప్పుకున్నట్లు తప్పుగా చూపించారు. అలాగే పాకిస్థాన్‌కు నీటి ప్రవాహం వంటి అంశాలపై కూడా వివాదాస్పద వ్యాఖ్యలు చేసినట్లు ఆ వీడియోను రూపొందించారు. దీనిపై స్పందించిన ప్రెస్ ఇన్ఫర్మేషన్ బ్యూరో (పీఐబీ) ఫ్యాక్ట్ చెక్ యూనిట్.. ఇది పూర్తిగా డిజిటల్ పద్ధతిలో సృష్టించిన తప్పుడు వీడియో అని తేల్చి చెప్పింది. అసలైన బ్రీఫింగ్ వీడియోలు ప్రభుత్వం వద్ద అందుబాటులో ఉన్నాయని.. ప్రజలు వాటిని చూసి వాస్తవాలు గ్రహించాలని కోరింది. ముఖ్యంగా పొరుగు దేశం పాకిస్థాన్‌కు చెందిన కొన్ని ప్రోపగాండా ఖాతాలు ఈ తప్పుడు ప్రచారాల వెనుక ఉన్నట్లు అధికారులు గుర్తించారు. తప్పుడు, అవాస్తవమైన సమాచారాన్ని సోషల్ మీడియాలో షేర్ చేయవద్దని ప్రభుత్వం పౌరులకు విజ్ఞప్తి చేసింది. ఏదైనా సమాచారం కావాలంటే కేవలం అధికారిక ప్రభుత్వ వెబ్‌సైట్లు, హ్యాండిల్స్‌ను మాత్రమే అనుసరించాలని సూచించింది.

# పోలవరం.. టీజీ గరం

**మొదటి పేజీ తరువాయి**

పోలవరం లిఫ్ట్ స్కీమ్‌ను మళ్లీ ప్రారంభించడంపై రేవంత్ రెడ్డి ప్రభుత్వం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కేంద్ర ప్రభుత్వం అనుమతి లేకుండా.. ఆంధ్రప్రదేశ్ నిర్మాణ పనులు చేపడుతోందని తీవ్ర ఆరోపణలు చేసింది. పోలవరం లిఫ్ట్ స్కీమ్ పనులను వెంటనే ఆపాలని తెలంగాణ తేల్చి చెప్పింది. ఏపీ ప్రభుత్వం ప్రాజెక్టు పనులను చేయకుండా నియంత్రించాలని పోలవరం ప్రాజెక్టు అథారిటీ (పీపీఏ)కి విజ్ఞప్తి చేసింది. మరోవైపు.. ఇవాళ ఢిల్లీకి వెళ్లిన ఏపీ సీఎం చంద్రబాబు.. కేంద్ర జలశక్తి శాఖ మంత్రి సీఆర్ పాటిల్‌తో సుదీర్ఘంగా చర్చించారు. ఆంధ్రప్రదేశ్‌కు జీవనాడి లాంటి పోలవరం ప్రాజెక్టు సహా రాష్ట్రంలో పెండింగ్‌లో ఉన్న సాగునీటి ప్రాజెక్టులపై కేంద్రమంత్రితో చంద్రబాబు మంతనాలు సాగించారు. ఏపీ ప్రయోజనాలను రక్షించడమే లక్ష్యంగా కీలక ప్రతిపాదనలతో కూడిన లేఖను కేంద్రమంత్రికి ముఖ్యమంత్రి సమర్పించారు. అదే సమయంలో వచ్చే ఏడాది నిర్వహించనున్న గోదావరి పుష్కరాల నాటికి పోలవరం ప్రాజెక్టును పూర్తి చేసేలా.. రాష్ట్ర ప్రభుత్వానికి కేంద్ర ప్రభుత్వం సహకరించాలని సీఎం చంద్రబాబు కేంద్రమంత్రికి విజ్ఞప్తి చేశారు. ఏప్రిల్ 2వ తేదీ నాటికి కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణం విజయవంతంగా పూర్తి అయిందని వెల్లడించారు. ఇక గ్యాప్ 1, 2 పనులు శరవేగంగా జరుగుతున్నాయని వెల్లడించారు. రాష్ట్ర సాగునీటి అవసరాల కోసం కాలువల సామర్థ్యాన్ని 17,500 క్యూసెక్కులకు పెంచినందున.. అందుకు అయ్యే వ్యయాన్ని కేంద్ర ప్రభుత్వమే భరించాలని విన్నవించారు. 2011 నుంచి ఉన్న స్టాప్ వర్క్ ఆర్డర్‌ను పూర్తిగా ఎత్తివేయాలని కోరారు.

## 17 రాష్ట్రాలు, 5 యూటీల్లో ఎస్ఐఆర్

**మొదటి పేజీ తరువాయి**

మూడో దశకు సమాయత్తమవుతుంది. ఇప్పటి వరకు ఉత్తరప్రదేశ్, పశ్చిమబెంగాల్, తమిళనాడు, రాజస్థాన్, ఛత్తీస్‌గఢ్, కేరళ, పుదుచ్చేరి, అండమాన్ నికోబర్ దీవులు, లక్షద్వీప్, గుజరాత్, మధ్యప్రదేశ్, గోవా, బీహార్ రాష్ట్రాలలో 'ఎస్ఐఆర్' చేపట్టారు. అసోంలోనూ ప్రత్యేక సవరణ కార్యక్రమం జరిగింది. మొత్తం దేశంలోని 99 కోట్ల మంది ఓటర్లలో 60 కోట్ల ఓటర్లకు సంబంధించిన 'ఎస్ఐఆర్' ప్రక్రియ పూర్తయినట్లు అధికారులు తెలిపారు. వాస్తవానికి, ఏప్రిల్ నుంచి సర్ ప్రక్రియ చేపట్టనున్నట్లు పై రాష్ట్రాలకు ఫిబ్రవరి 19వ తేదీన ఈసీ లేఖ రాసింది. ఐదు రాష్ట్రాల ఎన్నికలు సహా వివిధ కారణాల వల్ల బ్రేక్ పడింది. వాటితో పాటు ఎస్ఐఆర్‌పై ప్రతిపక్షాలు సుప్రీంకోర్టుకు వెళ్ళడం కూడా జాప్యానికి కారణమైంది.

## పరారీలో బండి భగీరథ్

**మొదటి పేజీ తరువాయి**

తెలిపారు. ఈ కేసులో నేరం రుజువు అయితే.. కచ్చితంగా నిందితుడిని అరెస్ట్ చేస్తామని స్పష్టం చేశారు. ఈ బండి భగీరథ్ పోక్సో కేసుకు సంబంధించిన దర్యాప్తుకు కార్యాచరణ రెడీ చేశామన్న డీసీపీ రితిరాజ్.. ఇప్పటికే బాధితురాలి స్టేట్‌మెంట్ రికార్డ్ చేశామని చెప్పారు. మరిన్ని వివరాల కోసం మరోసారి ఆమె స్టేట్‌మెంట్ రికార్డు చేస్తామని స్పష్టం చేశారు. చట్టప్రకారం ఇప్పటికే ఈ కేసుకు సంబంధించిన సమాచారాన్ని సేకరించామని.. ఫోన్ కాల్‌డేటా, టెక్నికల్ ఆధారాలను సేకరించాల్సి ఉందని తెలిపారు. వీలైనంత వేగంగా కేసును దర్యాప్తు చేసి.. బాధితురాలికి న్యాయం చేస్తామని డీసీపీ రితిరాజ్ వెల్లడించారు. అదే సమయంలో ఈ కేసులో నిందితుడిగా ఉన్న బండి భగీరథ్ ఇప్పటివరకు దొరకలేదని.. తప్పకుండా పట్టుకుంటామని స్పష్టం చేశారు. బాధితురాలికి న్యాయం చేయాల్సిన బాధ్యత తమపై ఉందని తెలిపారు.

## విజయ్‌కు జెడ్ ప్లస్ భద్రత

**మొదటి పేజీ తరువాయి**

అత్యాధునిక ఆయుధాలతో, 55 మంది కేంద్ర భద్రతా సిబ్బందితో 24 గంటల భద్రత కల్పిస్తుంది. సీఎం భద్రతా బృందంలో 10 మందికి పైగా ఎన్ఎస్‌జీ కమెండోలను చేర్చారు. తమిళనాడు ముఖ్యమంత్రి కేంద్రం మరింత కట్టుదిట్టం చేసింది. ఈ భద్రతా దళంలోని సభ్యులందరూ అత్యాధునిక ఎంపీ5 సబ్‌మెషిన్ గన్‌లతో సాయుధులై ఉంటారు. అంతేకాకుండా ఇంతకు ముందు 'వై' కేటగిరీ భద్రత పొందుతున్న విజయ్ భద్రతకు ఒక బుల్లెట్‌ప్రూఫ్ వాహనం, ఒక పైలట్ కారును కూడా కేటాయించారు. 'జెడ్ ప్లస్' కేటగిరీ అనేది వీఐపీలకు అందించే అత్యున్నత స్థాయి భద్రత. ప్రాణహాని ఉండే నాయకులు, ప్రముఖ రాజకీయ నాయకులకు ఈ భద్రతను కల్పిస్తారు. ఇందులో భాగంగా 36 మంది కమాండోలు, అత్యాధునిక ఆయుధాలు, ఒక బుల్లెట్‌ప్రూఫ్ వాహనాన్ని మోహరిస్తారు.

# 1100 కోట్లతో విద్యాకిట్లు

**మొదటి పేజీ తరువాయి**

సమయంలో చదువును మధ్యలో ఆపేయకుండా ఉండేందుకు.. పాఠశాల, కాలేజీ విద్యను అనుసంధానం చేస్తున్నట్లు వెల్లడించారు. ఈ క్రమంలోనే జూన్‌లో ప్రారంభం కానున్న విద్యా సంవత్సరం నుంచి.. ప్రభుత్వ స్కూళ్లలో చదివే విద్యార్థులకు 9 వస్తువులతో కూడిన విద్యా కిట్లను పంపిణీ చేయనున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి ప్రకటించారు. ఈ విద్యా కిట్ల కోసం రూ.1100 కోట్లను కేటాయించినట్లు వెల్లడించారు. అదే సమయంలో వచ్చే విద్యా సంవత్సరం నుంచి మధ్యాహ్న భోజనంతో పాటు బ్రేక్ ఫాస్ట్ పథకాన్ని కూడా అందిస్తామని చెప్పారు. విద్యార్థులకు బలవర్ధకమైన పాలు, రాగి జావ వంటి పోషకాహారాలను అందించాలని నిర్ణయించినట్లు చెప్పారు. ప్రస్తుతం విద్యారంగంలో సమూల మార్పులు వచ్చాయని సీఎం రేవంత్ రెడ్డి తెలిపారు. కానీ మనం మాత్రం ఇంకా పాతకాలం సిలబస్‌నే చదువుకుంటున్నామని పేర్కొన్నారు. టెన్ ప్లస్ టు విధానం తెలంగాణలో లేకపోవడం వల్లే పదో తరగతి తర్వాత డ్రాపౌట్లు పెరుగుతున్నాయని స్పష్టం చేశారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ అంటూ కులానికి ఒక రెసిడెన్షియల్ స్కూల్‌ను ఏర్పాటు చేశారని.. అలా చేయడం వల్ల కులవివక్ష పెరుగుతుందని గ్రహించినట్లు చెప్పారు. విద్యార్థుల మధ్య కులవివక్ష లేకుండా చూసేందుకే ఇంటిగ్రేటెడ్ స్కూళ్లను నిర్మిస్తున్నట్లు స్పష్టం చేశారు. దేశ భవిష్యత్‌ను నిర్మించే వేదికలుగా ప్రభుత్వ పాఠశాలలు మారాలని తెలిపారు. తెలంగాణలో విద్యా సంస్కరణల్లో భాగంగా నర్సరీ నుంచి 12వ తరగతి వరకు.. విద్యా కమిషన్ సూచనలతో సరికొత్త విధానాన్ని తెస్తున్నట్లు ప్రకటించారు. ప్రైవేట్ స్కూళ్లలో 38 లక్షల మంది విద్యార్థులు చదువుతుంటే.. ప్రభుత్వ స్కూళ్లలో మాత్రం 19 లక్షల మందే చదవడంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బడ్జెట్‌లో విద్యాశాఖకు నిధులను క్రమంగా 15 శాతానికి పెంచుతామని హామీ ఇచ్చారు. ఇక రాష్ట్రంలో ఉన్న టీచర్లకు ఇంటర్నేషనల్ స్టాండర్డ్స్ విద్యా విధానాలపై అవగాహన కల్పించేందుకు వారిని విదేశాలకు పంపిస్తున్నట్లు తెలిపారు. ఇప్పటికే 25 మంది టీచర్లను



ఫిన్లాండ్‌కు పంపించామని.. త్వరలో జపాన్, వియత్నాం, సింగపూర్ దేశాలకు మరికొందరిని పంపిస్తామని పేర్కొన్నారు. ప్రతీ సంవత్సరం ఉత్తమ ప్రతిభ కనబరిచిన 500 మంది టీచర్లను విదేశాలకు పంపించేలా ప్రణాళికలు రెడీ చేయాలని ఆదేశించారు. ఇక రాష్ట్రంలో ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించడంలో తమ ప్రభుత్వం చిత్తశుద్ధిని చాటుకుందని సీఎం రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే 11000 పోస్టులతో డీఎస్సీ నోటిఫికేషన్ ఇచ్చి.. తక్కువ సమయంలో ఖాళీలను భర్తీ చేసిన ఏకైక ప్రభుత్వం తమదేనని తేల్చి చెప్పారు. 20 ఏళ్లుగా పెండింగ్‌లో ఉన్న 22 వేల మంది టీచర్లకు ప్రమోషన్లు ఇచ్చినట్లు గుర్తు చేశారు.



### తెలంగాణ మహిళా కమిషన్ చైర్‌పర్సన్‌గా

## గద్వాల విజయలక్ష్మి

**మొదటి పేజీ తరువాయి**

సమయంలో శ్రీకాంతచారి చేసిన త్యాగం.. ఇప్పటికీ తెలంగాణలో గుర్తు ఉంది. మహిళా కమిషన్‌లో శంకరమ్మకు అవకాశం ఇవ్వడం ద్వారా తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు కోసం ఉద్యమం చేసిన కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం గౌరవం ఇచ్చినట్లు ఉందని పలువురు అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు. తెలంగాణ సాయుధ పోరాట యోధురాలైన చాకలి ఐలమ్మ మనవరాలు చిట్యాల శ్వేతను కూడా మహిళా కమిషన్‌లో సభ్యురాలిగా అవకాశం కల్పించింది. తెలంగాణ రైతాంగ పోరాట చరిత్రలో చాకలి ఐలమ్మ ప్రముఖ పాత్ర పోషించి.. ఇప్పటికీ గుర్తింపు పొందారు. ఇక గద్వాల విజయలక్ష్మి , కాసోజు శంకరమ్మ, చిట్యాల శ్వేతలతోపాటు మరికొంతమందికి కూడా మహిళా కమిషన్ సభ్యులుగా రాష్ట్ర ప్రభుత్వం అవకాశం కల్పించింది. సదాలక్ష్మి, శశికళ యాదవ్ రెడ్డి, రాధాభాయి, ఉజ్మా షకీరాలను కూడా తెలంగాణ ప్రభుత్వం మహిళా కమిషన్ సభ్యులుగా నియమించింది. ఈ నియామకాల్లో సామాజిక వర్గాలకు కూడా ప్రాతినిధ్యం కల్పించే ప్రయత్నం చేసినట్లు తెలుస్తోంది. మహిళలపై జరిగే అన్యాయాలు, వేధింపులు, వివక్ష అంశాలపై తెలంగాణ మహిళా కమిషన్ చర్యలు తీసుకుంటుంది. మహిళల భద్రత, మహిళల హక్కులు, సంక్షేమ పథకాల అమలుపై కొత్త కమిషన్ ప్రత్యేక దృష్టి పెట్టే అవకాశం ఉంది.

## కీబోర్డులోనే కంప్యూటర్

**హెచ్‌పీ సరికొత్త ఆవిష్కరణ.. ఎలైట్‌బోర్డ్ జీ1ఏ పేరుతో విడుదల**

న్యూఢిల్లీ: ప్రముఖ టెక్నాలజీ సంస్థ హెచ్‌పీ ఒక సరికొత్త ఆవిష్కరణతో ముందుకొచ్చింది. పూర్తి స్థాయి ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) పీసీని ఒక కీబోర్డులో అమర్చి 'హెచ్‌పీ ఎలైట్‌బోర్డ్ జీ1ఏ' పేరుతో విడుదల చేసింది. 1980ల నాటి యాపిల్ 2, కమోడోర్ 64 పీసీల మాదిరిగా కీబోర్డులోనే కంప్యూటర్ భాగాలను అమర్చారు. కానీ ఇది ఆధునిక వ్యాపార అవసరాలకు అనుగుణంగా రూపొందించబడింది. ప్రధానంగా ఆఫీసు, ఇల్లు రెండుచోట్లా పనిచేసే 'డ్యూయల్ డెస్కర్స్' కోసం, అలాగే తక్కువ స్థలం ఉండే కాల్ సెంటర్లు, ఇతర కార్యాలయాల కోసం దీనిని తయారు చేశారు. ల్యాప్‌టాప్ బదులు కేవలం ఈ కీబోర్డును (సుమారు 675 గ్రాముల బరువు) ఇంటికి, ఆఫీసుకు తీసుకెళ్లవచ్చు. యూఎస్‌బీ4 పోర్టు ద్వారా దీనిని మానిటర్‌కు కనెక్ట్ చేయవచ్చు. థండర్‌బోల్ట్/యూఎస్‌బీ వీడియో సపోర్ట్ ఉన్న మానిటర్ అయితే ఉత్తమం. అవసరమైతే యూఎస్‌బీ నుంచి హెచ్‌డీఎంఐ అడాప్టర్‌ను కూడా ఉపయోగించవచ్చు.

## మళ్లీ వర్క్ ఫ్రమ్ హోమ్!

**మొదటి పేజీ తరువాయి**

నగరాల్లో ఉద్యోగుల రోజువారీ ప్రయాణాల వల్ల ఇంధన వినియోగం, ట్రాఫిక్, కాలుష్యం, మానసిక ఒత్తిడిని పెంచుతున్నాయని, అవసరం లేని ప్రయాణాలను తగ్గించడం దేశ ప్రయోజనానికి ఉపయోగపడుతుందని నైట్స్ అభిప్రాయపడింది. అయితే, పరిశ్రమ వర్గాలు మాత్రం పూర్తిస్థాయి వర్క్ ఫ్రమ్ హోమ్‌కు తిరిగి వెళ్లడం కష్టమని చెబుతున్నాయి.

## సీఎం వెరీ సీరియస్

**మొదటి పేజీ తరువాయి**

భద్రతా ఏర్పాట్లలో పోలీసు సిబ్బంది అంతా బిజీగా ఉండటం వల్లే విచారణలో కొంత ఆలస్యం జరిగిందని వివరించారు. ఇప్పటికే ఈ కేసుకు సంబంధించిన ప్రాథమిక వివరాలను, ఇప్పటివరకు సేకరించిన సమాచారాన్ని సీఎం రేవంత్ రెడ్డికి డీజీపీ అందజేశారు. ఈ కేసును వేగవంతంగా, లోతుగా విచారించడానికి ప్రత్యేక పోలీసు బృందాలను ఏర్పాటు చేయాలని సీఎం ఆదేశించారు. విచారణ ప్రక్రియను ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, సమగ్ర నివేదికను తనకు సమర్పించాలని సూచించారు. ఎటువంటి రాజకీయ ఒత్తిళ్లకు తలొగ్గకుండా, సాక్ష్యాధారాల ఆధారంగా చట్టపరమైన చర్యలు తీసుకోవాలని స్పష్టం చేశారు. శాంతిభద్రతల విషయంలో ఉపేక్షించేది లేదని స్పష్టం చేశారు.

# ప్రధానితో కలిసి పనిచేస్తాం

## పార్టీలు, సిద్ధాంతాలు వేరైతేనేం.. 2047 వికసిత్ భారత్ లక్ష్యం.. సీఎం రేవంత్ రెడ్డి స్పష్టీకరణ

హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): ప్రధానమంత్రి నరేంద్ర మోదీ.. తెలంగాణ పర్యటన సందర్భంగా హైదరాబాద్ హెచ్ఐసీసీలో పలు అభివృద్ధి పనులకు ప్రారంభోత్సవాలు, శంకుస్థాపనలు చేశారు. ఈ కార్యక్రమానికి రాష్ట్ర ప్రభుత్వం తరఫున తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి హాజరయ్యారు. ప్రధాని మోదీ, సీఎం రేవంత్ రెడ్డి ఒకే వేదికపై కనిపించడం.. ఆసక్తికరంగా మారింది. ఈ క్రమంలోనే తెలంగాణ అభివృద్ధిపై ప్రధాని మోదీ పెద్ద మనసు చూపించాలని రేవంత్ రెడ్డి కోరగా.. తమతో కలిసి రావాలని ప్రధాని మోదీ పేర్కొన్నారు. అయితే ఇప్పుడు ఈ వ్యాఖ్యలే తెలంగాణ రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారాయి. ఈ క్రమంలోనే ఈ వ్యాఖ్యలపై ప్రతిపక్షాలు ఆరోపణలు చేస్తున్న వేళ.. సీఎం రేవంత్ రెడ్డి క్లారిటీ ఇచ్చారు. ప్రధాని మోదీ తమతో కలిసి రావాలనే పిలుపును తాను స్వాగతిస్తున్నట్లు సీఎం రేవంత్ రెడ్డి చెప్పారు. మీడియాతో సోమవారం చిట్‌చాట్‌గా మాట్లాడిన సీఎం రేవంత్ రెడ్డి.. ఆదివారం రోజున ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధికారిక కార్యక్రమంలో రాష్ట్ర ప్రభుత్వం తరఫున తాను పాల్గొన్నట్లు వెల్లడించారు. ఇక తమతో కలిసి పనిచేయాలని ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపులో ఎలాంటి రాజకీయాలు లేవని తేల్చి చెప్పారు. రాష్ట్రంలో అభివృద్ధి, సంక్షేమం కోసం.. కేంద్ర ప్రభుత్వంతో కలిసి వెళ్లేందుకు తనకు అభ్యంతరం లేదని రేవంత్ రెడ్డి స్పష్టం చేశారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన వికసిత్ భారత్ నినాదం లాగే తెలంగాణ ప్రభుత్వం ఇచ్చిన విజన్ 2047ను సాధించేందుకు.. తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చేందుకు కేంద్ర ప్రభుత్వంతో రాష్ట్ర ప్రభుత్వం కలిసి నడుస్తుందని రేవంత్ రెడ్డి తేల్చి చెప్పారు. ఈ క్రమంలోనే సమాఖ్య వ్యవస్థలో కేంద్రం, రాష్ట్రాలు ఇచ్చిపుచ్చుకునే ధోరణిని అవలంబించి.. ముందుకు



వెళ్లాలని ఈ సందర్భంగా సీఎం గుర్తు చేశారు. ఇక కేంద్రంలో, రాష్ట్రంలో అధికారంలో పార్టీలు వేరుగా ఉన్నా.. ఆ పార్టీల సిద్ధాంతాలు వేరే అయినా.. అభివృద్ధి కోసం మాత్రం కలిసే పనిచేస్తామని మరోసారి నొక్కి చెప్పారు. తాను గతంలో ఎన్నోసార్లు ఢిల్లీకి వెళ్లి.. అక్కడి కేంద్రమంత్రులను, ప్రధాని మోదీని కలిసినప్పటికీ.. కేంద్ర ప్రభుత్వం నుంచి తెలంగాణకు ఆశించిన మద్దతు రాలేదని సీఎం రేవంత్ రెడ్డి కాస్త అసహనం వ్యక్తం చేశారు. ఇదే విషయాన్ని నిన్న ప్రధాని మోదీ ముందే సభలో చెప్పినట్లు గుర్తు చేశారు. ఇప్పటికైనా తనకు ప్రధాని మోదీ.. 2 గంటల సమయం ఇస్తే.. తెలంగాణ అభివృద్ధి కోసం తమ ప్రభుత్వం తయారు చేసిన ప్రణాళికలను వివరిస్తామని వెల్లడించారు.

## ఇతర పార్టీలు ఉండొద్దని మోదీ లక్ష్యం

**రేవంత్ రెడ్డిని తనతో కలవాలన్న వ్యాఖ్యలపై చామల**

హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): అనుకున్నది సాధించాలంటే తనతో కలవాలని ప్రధాని నరేంద్రమోదీ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో అనడాన్ని కాంగ్రెస్ పార్టీ ఎంపీ చామల కిరణ్ కుమార్ రెడ్డి తప్పుబట్టారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, దేశంలో ఇతర రాజకీయ పార్టీలు ఉండకూడదనే లక్ష్యంతో మోదీ పనిచేస్తున్నారని మండిపడ్డారు. తెలంగాణ భవిష్యత్తు కోసం తమకు సహకరించాలని ప్రధాని మోదీకి సీఎం రేవంత్ రెడ్డి విజ్ఞప్తి చేశారని అన్నారు. కానీ ప్రధాని మాత్రం తనతో కలిస్తే మీరు అనుకున్నది సాధిస్తారని రేవంత్ రెడ్డిని ఉద్దేశించి అనడం సరికాదని అన్నారు. దేశంలో ప్రతిపక్షాలకు బలమైన నాయకులు ఉండవద్దని ఆయన కోరుకుంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. మోదీతో ఉంటేనే అభివృద్ధి జరుగుతుందా అని దుయ్యబట్టారు. ఆయన అన్ని రాష్ట్రాలకు ప్రధానమంత్రే అని వ్యాఖ్యానించారు. ఫెడరల్ సిస్టంలో అన్ని రాష్ట్రాలను సమానంగా చూడాలని అన్నారు. గత రెండున్నరేళ్లుగా సీఎం రేవంత్ రెడ్డి ప్రధాని మోదీ, కేంద్రమంత్రులను కలుస్తూ రాష్ట్రానికి రావాల్సిన నిధుల గురించి అడుగుతున్నారని తెలిపారు. మోదీ గుజరాత్ సీఎంగా ఉన్నప్పుడు తమకు సహకరించాలని ఎలాగైతే మన్మోహన్ సింగ్‌ను కోరారో, ఇప్పుడు రేవంత్ రెడ్డి అలాగే కోరారని తెలిపారు. మన్మోహన్ హయాంలో ఇచ్చినట్లు ఇస్తే ఇప్పుడు వచ్చే దాంట్లో సగం కూడా రావని ప్రధాని చెప్పడం విడ్డూరంగా ఉందని అన్నారు. కాంగ్రెస్ హయాంలోనే ఎన్నో జాతీయ సంస్థలు ఏర్పడ్డాయని చామల కిరణ్ కుమార్ రెడ్డి అన్నారు. పశ్చిమ బెంగాల్‌లా తెలంగాణను కైవసం చేసుకుందామని మోదీ భావిస్తున్నారని ప్రభుత్వ విప్ బీర్ల యాదయ్య మండిపడ్డారు. ఆ రాష్ట్రంలో బీజేపీ ఎలా గెలిచిందో దేశమంతా చూసిందని అన్నారు. తెలంగాణలో బీజేపీ పప్పులు ఉడకవని, మళ్లీ గెలిచేది కాంగ్రెస్ పార్టీయే అన్నారు. రేవంత్ రెడ్డి మరోసారి ముఖ్యమంత్రి కావడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. బీజేపీ, బీఆర్ఎస్ కలిసి వచ్చినా కాంగ్రెస్ పార్టీకి పోటీ కాదని అన్నారు.

## 20 నుంచి టీఆర్ఎస్ జెండా పండుగ

### నెల రోజుల పాటు నిర్వహణ

**వార్డు స్థాయి వరకు జెండాల ఆవిష్కరణ**

**పార్టీ శ్రేణులకు కల్వకుంట్ల కవిత పిలుపు**



హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): తెలంగాణ రక్షణ సేన (టీఆర్ఎస్) పార్టీ భావజాలాన్ని గ్రామస్థాయి వరకు తీసుకెళ్లేందుకు ఈనెల 20 నుంచి జూన్ 20 వరకు నెల రోజుల పాటు రాష్ట్రవ్యాప్తంగా 'జెండా పండుగ' నిర్వహించాలని పార్టీ శ్రేణులకు అధ్యక్షులు కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. రాష్ట్ర రాజధాని, జిల్లా కేంద్రాల నుంచి మొదలుకొని మండల, గ్రామ స్థాయి వరకు ప్రతి వార్డులో పార్టీ జెండాలు ఎగురవేసి, పార్టీ ప్రకటించిన పాంచజన్య సిద్ధాంతాలను ప్రజలకు వివరించాలని ఆదేశించారు. రాష్ట్రం ఏర్పడి 12 ఏళ్లు గడిచినా నీళ్లు, నిధులు, నియామకాల విషయంలో తెలంగాణ మళ్లీ వంచనకు గురవుతోందని, వలస పాలన నాటి దుష్పరిణామాలను నేడు మళ్లీ ఎదుర్కొంటున్నామని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. అందుకే తెలంగాణ పునర్నిర్మాణం కోసం తెలంగాణ రక్షణ సేన బాధ్యత తీసుకొని ఉద్యమిస్తుందని తెలిపారు. తెలంగాణ ఏర్పడి పన్నెండున్నరేళ్లు గడిచిన సరే ఇంకా వలస పాలన నాటి దుష్పరిణామాలే ఇప్పటికీ కనిపిస్తున్నాయని కవిత ఆందోళన వ్యక్తం చేశారు. తెలంగాణ తెచ్చుకుంటే బతుకులు మారుతాయని అనుకున్న ప్రతివర్గం కూడా ఇప్పుడు తీవ్ర నిస్పృహలో ఉందని విచారం వ్యక్తం చేశారు. స్వరాష్ట్ర సాధనకు అవిశ్రాంతంగా ఉద్యమించిన మనమంతా కూడా ఇప్పుడు తెలంగాణ పునర్నిర్మాణం, సబ్బండ వర్గాల వికాసం కోసం మళ్లీ ఉద్యమించాల్సిన సమయం వచ్చిందన్నారు. ఇందులో భాగంగానే తెలంగాణ రక్షణ సేన జెండాను ప్రతి వాడకు, పార్టీ సిద్ధాంతాలను ప్రతి గడపకు తీసుకెళ్లాలని పార్టీ శ్రేణులకు సూచించారు. పార్టీ ఆవిర్భానికి మూడు నెలల ముందు నుంచే పెద్ద ఎత్తున చేరిన నాయకత్వంతో పాటు తెలంగాణ జాగృతి నాయకులు సమన్వయంతో జెండా పండుగను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.


## మీరిచ్చే ప్రతి పైసా.. ప్రజాస్వామ్య పరిరక్షణకే!

ఉన్నది ఉన్నట్లు చెప్పే తత్వం..
ఎవరికీ కొమ్ముకాయని పథం..
ప్రజా సమస్యలపై యుద్ధం..
ప్రజా హితమే మా శపథం..
ప్రజాపోరులో మేము సంసిద్ధం..
ఇదే నేటి 'ఈవార్తలు' నైజం!

అక్షరమే అస్త్రంగా, ప్రభుత్వాన్ని సరైన దారిలో నడిపించే శస్త్రంగా, వార్తలను నిక్కచ్చిగా అందిస్తూ సాగుతున్న అలుపెరుగని ప్రయాణం మాది. పాలకుల తప్పులను ఎండగడుతూ, వ్యవస్థలను గాడిలో పెట్టే శక్తిమంతమైన శస్త్రం నేటి 'ఈవార్తలు'. ఎవరికీ తలొగ్గని కలం, న్యాయం కోసం గొంతెత్తే గళం.. మన పత్రిక. నిష్పక్షపాత జర్నలిజం మనుగడ సాగించాలంటే అది ప్రజాబలంతోనే సాధ్యం. మీరు అందించే ప్రతి పైసా ఆర్థిక దన్ను మాత్రమే కాదు, అక్రమాలపై మేము ఎక్కుపెట్టే అస్త్రానికి పదును. ప్రజాసమస్యలపై రాజీలేని పోరాటానికి, నిజాలను నిర్భయంగా చాటిచెప్పడానికి మాతో చేయి కలపండి. సత్యాన్వేషణలో భాగస్వాములుకండి.. ప్రజాస్వామ్య పరిరక్షణలో తోడుగా నిలవండి.

- శ్రావణ్ కుమార్ బొమ్మకంటి, ఎడిటర్

సందేహాలకు 94404 55811 నంబర్‌ను సంప్రదించవచ్చు.




## మోదీపై వీహెచ్ కేసు

హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): ప్రధాని నరేంద్ర మోదీ చేసిన 'ఎంఎంసీ' (ముస్లిం లీగ్ – మావోయిస్టు కాంగ్రెస్) వ్యాఖ్యలు తెలంగాణ రాజకీయాల్లో పెద్ద దుమారాన్నే రేపుతున్నాయి. నిన్న సికింద్రాబాద్ పరేడ్ గ్రౌండ్స్‌లో జరిగిన బహిరంగ సభలో ప్రధాని ఈ వ్యాఖ్యలు చేయగా... నేడు ఈ వ్యాఖ్యలపై కాంగ్రెస్ సీనియర్ నేత, ప్రభుత్వ సలహాదారు వి. హనుమంతరావు (వీహెచ్) ఘాటుగా స్పందించారు. ప్రధాని మోదీ కాంగ్రెస్ పార్టీని మావోయిస్టులతో ముడిపెట్టడాన్ని వీహెచ్ తీవ్రంగా ఖండించారు. హింస కారణంగానే దేశం కోసం ఇందిరా గాంధీ, రాజీవ్ గాంధీ తమ ప్రాణాలను త్యాగం చేశారని ఆయన గుర్తు చేశారు. అలాంటి చరిత్ర కలిగిన పార్టీని మావోయిస్టులతో పోల్చడం ఆ మహనీయుల త్యాగాలను అవమానించడమేనని ఆవేదన వ్యక్తం చేశారు. అలాగే, స్వాతంత్ర్య పోరాటంలో ముస్లింల పాత్రను విస్మరించి, వారిని కించపరిచేలా మాట్లాడటం ప్రధాని పదవిలో ఉన్న వ్యక్తికి తగదని హితవు పలికారు. ప్రధాని వ్యాఖ్యలపై పోలీసులకు ఫిర్యాదు చేస్తానని వీహెచ్ తెలిపారు. మోదీ వ్యాఖ్యలు కాంగ్రెస్ కార్యకర్తల మనోభావాలను దెబ్బతీశాయని, ఆయనపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. ఒకవేళ పోలీసులు స్పందించకుంటే కోర్టును ఆశ్రయిస్తామని కూడా హెచ్చరించారు.

## ఐపీఎస్ భార్య హత్య కేసులో పనిమనిషి అరెస్టు

పూణె/హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): హైదరాబాద్‌లో సంచలనం సృష్టించిన విశ్రాంత ఐపీఎస్ అధికారి భార్య తనూజ రంజన్ హత్య కేసులో పోలీసులు కీలక పురోగతి సాధించారు. ఈ కేసులో ప్రధాన నిందితురాలిగా ఉన్న నేపాలీ పనిమనిషి కల్పన అలియాస్ ధర్మ (30)ను మహారాష్ట్రలోని పూణెలో అరెస్టు చేశారు. ఆమెను ప్రత్యేక బృందాలు హైదరాబాద్‌కు తరలిస్తున్నట్లు సమాచారం. ఈ కేసును ఛాలెంజ్‌గా తీసుకున్న పోలీసులు, నిందితుల కోసం పలు రాష్ట్రాల్లో ముమ్మరంగా గాలించారు. హైదరాబాద్, పూణె, ముంబై, ఢిల్లీ, బిహార్‌కు ప్రత్యేక బృందాలను పంపించి, నిందితులు దేశ సరిహద్దులు దాటకుండా పకడ్బందీ చర్యలు చేపట్టారు. ఈ క్రమంలో పట్టుబడిన ఇద్దరు ఇచ్చిన సమాచారం ఆధారంగా పోలీసులు పూణెలో తలదాచుకున్న కల్పనను అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల దర్యాప్తులో ఈ హత్య వెనుక నేపాల్‌కు చెందిన సాహూ గ్యాంగ్ హస్తం ఉన్నట్లు తేలింది. ఢిల్లీ జైలు నుంచే ఈ దోపిడీకి పథకం రచించినట్లు గుర్తించారు. ఈ నేరం కోసం ముంబై, నేపాల్, పాట్నా నుంచి వేర్వేరు వ్యక్తులతో ఒక బృందాన్ని ఏర్పాటు చేసినట్లు నిర్ధారించారు. దోపిడీ చేసిన బంగారాన్ని ముంబైలో దాచిపెట్టినట్లు కూడా పోలీసులు కనిపెట్టారు.

## కేంద్ర హోంమంత్రి పరారీ దేశ చరిత్రలో తొలిసారి

**బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్**

హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): పోక్సో కేసులో ఇరుక్కున్న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమారుడు బండి సాయి భగీరథ్ పరారీలో ఉండడంపై బీఆర్ఎస్ కార్యనిర్వాహక అధ్యక్షుడు కేటీఆర్ తీవ్రంగా స్పందించారు. ఒక కేంద్రమంత్రి కుమారుడు పరారీలో ఉండడం దేశ చరిత్రలోనే మొదటిసారి అని కేటీఆర్ ఎక్స్‌లో వ్యంగ్యంగా పోస్ట్ పెట్టారు. ఆ పోస్ట్‌కు ఆయన బేటీ బచావో, పోక్సో యాష్ ట్యాగ్‌లు జత చేశారు. మైనర్ బాలికపై లైంగిక దాడికి పాల్పడిన బండి సాయి భగీరథ్ పోలీసులకు దొరక్కుండా తప్పించుకు తిరుగుతడంపై కేటీఆర్ సైటైర్లు వేశారు. 'భారత దేశ చరిత్రలో కేంద్ర హోం మంత్రి కుమారుడు పరారవ్వడం ఇదే మొదటిసారి' అని ఆయన ఎక్స్‌లో పోస్ట్ పెట్టారు. పేట్ బషీర్‌బాగ్ పోలీస్ స్టేషన్‌లో బాధితురాలి ఫిర్యాదుతో భగీరథ్‌ను అదుపులోకి తీసుకునేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. కానీ, మూడు రోజులుగా అతడి ఫోన్ స్విచ్ఛాఫ్ చేసి ఉంది. దాంతో, కూకట్‌పల్లి డీసీపీ రితిరాజ్ గైక్వాడ్ నేతృత్వంలోని ప్రత్యేక దర్యాప్తు బృందం విచారణను వేగవంతం చేసింది. ఈ నేపథ్యంలో భగీరథ్ పరారీలో ఉండడంపై కేటీఆర్ ఎక్స్ పోస్ట్ ద్వారా నేరస్థులకు కొమ్ముకాస్తున్న బీజేపీ తీరుపై ఆగ్రహం వ్యక్తం చేశారు.

## బీజేపీకేం సంబంధం?

**ఆ విషయం బండి సంజయ్ కుటుంబానిది**

**తెలంగాణ బీజేపీ చీఫ్ రాంచందర్ రావు**



హైదరాబాద్, మే 11 (ఈవార్తలు): కేంద్ర సహాయమంత్రి బండి సంజయ్ తనయుడు బండి భగీరథ్‌పై నమోదైన కేసుతో బీజేపీకి సంబంధం లేదని ఆ పార్టీ తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు రామచందర్ రావు స్పష్టం చేశారు. ఈరోజు ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఈ కేసులో చట్టం తన పని తాను చేసుకుపోతుందని ఆయన తెలిపారు. ఈ విషయం బండి సంజయ్ కుటుంబంలో జరిగిందని ఆయన తెలిపారు. బీజేపీ అంశం కాదని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసులో బండి సంజయ్ కుటుంబ సభ్యుల ప్రమేయం ఉంటే విచారణ జరిపించాలని అన్నారు. సికింద్రాబాద్ పరేడ్ మైదానంలో ప్రధానమంత్రి నరేంద్రమోదీ బహిరంగసభకు అసాధారణ స్పందన వచ్చిందని రామచందర్ రావు అన్నారు. మోదీ పర్యటనతో బీఆర్ఎస్, కాంగ్రెస్ పార్టీలలో స్పష్టమైన ప్రకంపనలు వచ్చాయని అన్నారు. ఈ సభ విజయవంతం కావడానికి నాయకులు, కార్యకర్తలు ఎంతో కృషి చేశారని అన్నారు. వైద్యులు, నర్సులు, న్యాయవాదులు, యువత, మహిళలు, వివిధ రంగాల నిపుణులు, హైదరాబాద్ నలుమూలల నుంచి బీజేపీ కార్యకర్తలతో కలిసి ఈ సభలో అపారమైన ఉత్సాహంతో పాల్గొన్నారని తెలిపారు. ఈ కార్యక్రమానికి తరలివచ్చిన అశేష జనసమూహం, అక్కడ వెల్లివిరిసిన ఉత్సాహం, మోదీ నాయకత్వంపై, అలాగే 'వికసిత తెలంగాణ – వికసిత భారతదేశం' అనే దార్శనికతపై ప్రజలలో పెరుగుతున్న అచంచలమైన విశ్వాసానికి సజీవ నిదర్శనంగా నిలిచిందని రామచందర్ రావు అన్నారు.




# మనోళ్లు ఏఐ వీరులు!

**భారత్‌లో ఏఐ వాడకం జోరు**
**ఆఫీసుల్లో 86% మంది వినియోగం**



**భారతదేశంలోని కార్యాలయాల్లో ఆర్టిఫిషియల్ ఇంటెలిజెన్స్ (ఏఐ) వినియోగం గణనీయంగా పెరిగింది. దేశంలో దాదాపు 86 శాతం మంది ఉద్యోగులు తమ రోజువారీ పనిలో ఏఐని వాడుతున్నప్పటికీ, దానిపై పెట్టిన పెట్టుబడికి తగిన రాబడి అంచనాలకు తగ్గట్టుగా ఉందని కేవలం 35 శాతం మంది మాత్రమే సంతృప్తి వ్యక్తం చేశారు. అయితే, ఈ విషయంలో ప్రపంచ సగటు (22%) కంటే భారత్ మెరుగ్గా ఉండటం గమనార్హం.**

న్యూఢిల్లీ: ఈ వివరాలను టెక్నాలజీ నిపుణుల సంస్థ ఇసాకా సోమవారం విడుదల చేసిన తన నివేదికలో వెల్లడించింది. నివేదిక ప్రకారం భారతదేశంలోని 49 శాతం సంస్థలు ఇప్పుడు పూర్తిస్థాయి, అధికారిక ఏఐ విధానాన్ని కలిగి ఉన్నాయి. 2025లో ఇది 32 శాతంగా ఉండగా, ఇప్పుడు గణనీయంగా పెరిగింది. ప్రపంచ సగటు 38 శాతంతో పోలిస్తే ఇది అధికం. అయినప్పటికీ దేశంలోని 23 శాతం సంస్థలు పరిమిత విధానాలతోనే సరిపెడుతుండగా, 20 శాతం సంస్థల్లో అసలు ఎలాంటి ఏఐ పాలసీ లేకపోవడం గమనార్హం. రోజువారీ పనుల్లో ఏఐ భాగమైనప్పటికీ పాలన, కార్యాచరణ సంసిద్ధతలో ఇంకా వెనుకబాటుతనం కనిపిస్తోందని నివేదిక పేర్కొంది. రాబడి విషయంలో ఉద్యోగుల నుంచి మిశ్రమ స్పందనలు వ్యక్తమయ్యాయి. సుమారు 21 శాతం మంది రాబడి గురించి చెప్పడానికి ఇది చాలా తొందరపాటు అవుతుందని అభిప్రాయపడగా, మరో 21 శాతం మంది ఇప్పటివరకు పరిమిత రాబడి మాత్రమే వచ్చిందని తెలిపారు. ఇంకో 18 శాతం మందికి రాబడిపై ఎలాంటి అవగాహన లేదని తేలింది. భారతీయ ఉద్యోగులు ప్రధానంగా ఉత్పాదకత పెంచుకోవడానికి (56%), పునరావృతమయ్యే పనులను ఆటోమేట్ చేయడానికి (55%), కంటెంట్ రాసేందుకు (51%), భారీ డేటాను విశ్లేషించడానికి (42%) ఏఐని ఉపయోగిస్తున్నట్లు సర్వేలో తేలింది. సర్వేలో పాల్గొన్న వారిలో 82 శాతం మంది తమ వృత్తికి ఏఐ నైపుణ్యాలు చాలా అవసరమని భావిస్తున్నారు. రాబోయే 12 నెలల్లో తమ సంస్థలో ఏఐ సంబంధిత ఉద్యోగాలు పెరుగుతాయని 57 శాతం మంది అంచనా వేస్తున్నారు. గత ఏడాది ఇది 46 శాతంగా ఉంది. ఈ ఫలితాలపై ఇసాకా ఏఐ ప్రొడక్ట్ డెవలప్‌మెంట్ సీనియర్ మేనేజర్ కీత్ బ్లూమ్‌ఫీల్డ్-డివీస్ స్పందిస్తూ, "ఏఐ వల్ల ప్రయోజనాలు ఉన్నాయని చూపించాలనే ఒత్తిడి సంస్థలపై విపరీతంగా ఉంది. కానీ, చాలా సంస్థలకు రాబడిపై ఇంకా స్పష్టత రాలేదు. ఏఐలో పెట్టుబడికి రాబడి అనేది అనుకున్న సమయానికి రాదు. సిబ్బంది, ప్రక్రియలు, పాలనా నిర్మాణంపై నిరంతరం పెట్టుబడులు పెట్టినప్పుడే సరైన ఫలితాలు వస్తాయి" అని వివరించారు. ఈ సర్వేలో భారత్ నుంచి 265 మంది సహా ప్రపంచవ్యాప్తంగా 3,400 మంది డిజిటల్ నిపుణులు పాల్గొన్నారు.

## పటేల్ యువకులు చేతకానివాళ్లు

**తాగుతూ జులాయిగా తిరుగుతారు.. యూపీ గవర్నర్ కుమార్తె తీవ్ర వ్యాఖ్యలు**

లక్నో: ఉత్తరప్రదేశ్ గవర్నర్ ఆనందీబెన్ పటేల్ కుమార్తె, శ్రీ ఖోడల్‌ధామ్ ట్రస్ట్ (ఎస్కేటీ) అధ్యక్షురాలు అనర్ పటేల్ తమ పటేల్ సామాజికవర్గ యువతపై సంచలన వ్యాఖ్యలు చేశారు. పటేల్ వర్గంలోని యువకులు చాలామంది "అసమర్థులు"గా ఉండటం వల్లే ఆ వర్గానికి చెందిన అమ్మాయిలు ఇతర సామాజిక వర్గాల్లోని యువకులను వివాహాలు చేసుకుంటున్నారని ఆమె అభిప్రాయపడ్డారు. సోమవారం గుజరాత్‌లోని బనాస్కాంత జిల్లా గఢ్ గ్రామంలో సర్దార్ వల్లభ్‌భాయ్ పటేల్ విగ్రహావిష్కరణ కార్యక్రమంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. దీనికి సంబంధించిన వీడియో సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. ఈ సందర్భంగా అనర్ పటేల్ మాట్లాడుతూ.. "మన సమాజంలోని అబ్బాయిలు చాలామంది సమర్థంగా లేకపోవడం వల్లే మన అమ్మాయిలు ఇతర కులాల్లో పెళ్లిళ్లు చేసుకుంటున్నారు. మన అబ్బాయిలు మద్యం సేవిస్తూ, బయట జులాయిగా తిరుగుతూ, ఏ పనీ చేయకపోతే.. మన అమ్మాయిలు బయట వివాహం చేసుకోక ఏంచేస్తారు? ఈ నిజాన్ని మనం ఎందుకు అంగీకరించడం లేదు? ఎప్పుడూ మన అమ్మాయిలకే ఎందుకు సలహాలు ఇస్తున్నాం?" అని సమాజాన్ని సూటిగా ప్రశ్నించారు. అదే సమయంలో, సోషల్ మీడియా, టీవీ ఛానళ్ల ప్రభావాన్ని ఆమె తీవ్రంగా విమర్శించారు. "ఇది సోషల్ మీడియా యుగం. ఈ రోజుల్లో సర్దార్ పటేల్ జీవించి ఉంటే, 562 సంస్థానాలను ఏకం చేయలేకపోయేవారు. ఎందుకంటే ఇప్పుడు ప్రతి ఇంట్లో ఒక నాయకుడు తయారయ్యాడు" అని ఆమె వ్యాఖ్యానించారు. సమాజంలో విభజనలు సృష్టించే వారిని గుర్తించాలని ప్రజలకు పిలుపునిచ్చారు.

## భార్య పశువు కాదు

**ఆమెకూ జీవించే హక్కు.. గృహహింస కేసులో సుప్రీం**

న్యూఢిల్లీ: భార్యను ఏ భర్త కూడా పశువులా చూడకూడదని, ఆమెకు గౌరవంతో జీవించే సర్వ హక్కులు ఉన్నాయని సుప్రీంకోర్టు కీలక వ్యాఖ్యలు చేసింది. ఓ గృహహింస కేసు విచారణలో భాగంగా సుప్రీంకోర్టు ఈ కీలక వ్యాఖ్యలు చేసింది. గృహహింస ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తి ముందస్తు బెయిల్ కోసం వేసిన పిటిషన్‌ను అత్యున్నత న్యాయస్థానం విచారించింది. అనంతరం అతడి అభ్యర్థనను తోసిపుచ్చింది. అంతకుముందు పాట్నా హైకోర్టు కూడా అతని బెయిల్‌ను తిరస్కరించింది. నిందితుడు మద్యం మత్తులో భార్యపై దాడి చేశాడని బాధితురాలు తరఫు న్యాయవాది కోర్టుకు తెలిపారు. నేలపైకి తోయడంతో ఇటుక తగిలి ఆమె తలకు గాయమైందని అన్నారు. ఆ తర్వాత కర్రతోనూ దాడి చేసినట్లు ఆరోపణలు ఉన్నాయి. నిందితుడు మూడు వివాహాలు చేసుకున్నాడని కోర్టుకు తెలిపారు. ఇప్పుడు న్యాయస్థానాన్ని ఆశ్రయించిన బాధితురాలు అతడి మొదటి భార్య. బాధితురాలి వాదనలు విన్న న్యాయస్థానం, "మీరు మీ భార్యను ఎందుకు కొట్టాలనుకున్నారు? ఇలాగే వేధిస్తే ఆమె మిమ్మల్ని వదిలి వెళ్ళిపోతుంది కదా. మీరు రెగ్యులర్ బెయిల్ కోసం దరఖాస్తు చేసుకోండి" అని సూచించింది. నిందితుడి ముందస్తు బెయిల్‌ను తిరస్కరించింది.

## మోదీ మాట.. మంత్రుల వత్తాసు

**పొదుపు మంత్రపై తలో సలహా**

న్యూఢిల్లీ: అంతర్జాతీయ ఉద్రిక్తతల నేపథ్యంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ వాడకాన్ని ఏడాది పాటు తగ్గించాలని, బంగారం కొనుగోళ్లకు ఏడాది పాటు దూరంగా ఉండాలని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ ఇచ్చిన పిలుపుపై కేంద్రమంత్రులు స్పందించారు. విదేశీ మారకద్రవ్యాన్ని హరించే ఖర్చులను తగ్గించుకోవాలని ప్రజలు, పరిశ్రమ వర్గాలకు కేంద్రమంత్రి అశ్వినీ వైష్ణవ్ సూచించారు. అంతర్జాతీయంగా అస్థిర పరిస్థితులు నెలకొన్న తరుణంలో ప్రధాని స్పష్టమైన సందేశం ఇచ్చారని ఆయన అన్నారు. ఇరాన్, అమెరికా యుద్ధం నేపథ్యంలో శాంతి ఒప్పందం ఎప్పుడు కుదురుతుందో తెలియదని అన్నారు. ఈ నేపథ్యంలో ప్రజలు విదేశీ మారకద్రవ్యాన్ని హరించే ప్రతి ఖర్చును తగ్గించుకోవడం అవశ్యమని అన్నారు. విదేశీ మారకద్రవ్యాన్ని పరిరక్షించుకోవడానికి మన ప్రయత్నం చేద్దామని పిలుపునిచ్చారు. దానిని కాపాడుకోవడంతో పాటు మరింత సంపాదించాలని అన్నారు. ఈ రెండు పనులు సమాంతరంగా జరగాలని సూచించారు. దేశ ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని మోదీ పిలుపునిచ్చారని కేంద్రమంత్రి నితిన్ గడ్కరీ అన్నారు. ప్రయాణాల్లో భాగంగా ప్రజారవాణాను వినియోగించాలని సూచించారు. ఒక్కొక్కరు ఒక్కో వాహనంలో ప్రయాణించడాన్ని నివారించాలని కోరారు. అంతర్జాతీయ సవాళ్లను ఎదుర్కోవడంలో, ప్రపంచ ఇంధన భద్రతను బలోపేతం చేయడంలో ప్రధాని మోదీ ఇచ్చిన పిలుపు ఎంతో ఉపకరిస్తుందని రాజ్‌నాథ్ సింగ్ అన్నారు.

## సువేందు పీఏ హంతకులు దొరికారు

**నిందితులకు 13 రోజుల పోలీస్ కస్టడీ**

కోల్‌కతా: పశ్చిమ బెంగాల్ రాజకీయాల్లో పెను సంచలనం సృష్టించిన ముఖ్యమంత్రి సువేందు అధికారి వ్యక్తిగత సహాయకుడు (పీఏ) చంద్రనాథ్ రథ్ హత్య కేసులో అరెస్టయిన ముగ్గురు నిందితులను పోలీసులు బారాసాత్ కోర్టులో హాజరుపర్చగా, న్యాయస్థానం వారికి 13 రోజుల పోలీస్ కస్టడీ విధించింది. గత బుధవారం రాత్రి తన ఇంటికి అతి సమీపంలో చంద్రనాథ్ రథ్ దారుణంగా హత్యకు గురయ్యారు. దుండగులు పక్కా ప్లాన్‌తో నిస్సాన్ మైక్రా కారుతో ఆయన వాహనాన్ని అడ్డగించారు. వెంటనే ఇతర హంతకులు బైక్ పై వచ్చి, అతి సమీపం నుంచి కాల్పులు జరిపారు. ఈ ముఠా నాయకుడు విశాల్ శ్రీవాస్తవపై గతంలోనే 15కి పైగా హత్య, దోపిడీ కేసులు ఉన్నాయి. హత్య తర్వాత నిందితులు వాడిన కారును అక్కడే వదిలేసి, మరో వాహనంలో పారిపోయారు. పోలీస్ కస్టడీలో నిందితుల నుంచి అసలు విషయాలు రాబట్టేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. ఈ హత్య వెనుక కేవలం పాత కక్షలు ఉన్నాయా లేదా ముఖ్యమంత్రికి సన్నిహితుడు కావడంతో రాజకీయ కోణాలు ఏమైనా ఉన్నాయా అనే అంశంపై దర్యాప్తు ముమ్మరం చేశారు.

## లోన్ల రికవరీకి ఎస్బీఐ 4 వేల నియామకాలు

న్యూఢిల్లీ: దేశీయ అతిపెద్ద ప్రభుత్వ రంగ ఎస్‌బీఐ రుణాల వసూళ్లను మరింత బలోపేతం చేయడానికి పెద్ద ఎత్తున నియామకాలకు సిద్ధమవుతోంది. వచ్చే ఏడాదిలో 3,000 నుంచి 4,000 మంది వరకు ఉద్యోగులను ప్రత్యేకంగా లోన్ రికవరీ విభాగంలోకి తీసుకోవాలని భావిస్తున్నట్టు ఎస్‌బీఐ ఛైర్మన్ సీ ఎస్ శెట్టి చెప్పారు. ఈ సిబ్బంది ప్రధానంగా ఫీల్డ్‌లో




పనిచేస్తూ, చెల్లించడంలో ఆలస్యం చేసే రుణాలపై పనిచేస్తారు. గత కొన్నేళ్లుగా ఎస్‌బీఐ బ్యాడ్ లోన్స్(ఎన్‌పీఏలు) తగ్గించడంపై ప్రత్యేక దృష్టి సారించింది. ప్రస్తుతం బ్యాంకు నికరంగా 0.39 శాతం తక్కువ ఎన్‌పీఏను కలిగి ఉంది. ఇది గడిచిన 20 ఏళ్లలోనే కనిష్ట స్థాయి. లోన్స్ ఇవ్వడం కఠిన నిబంధనలు, రిస్క్‌ను ముందుగానే గుర్తించడం ద్వారా ఇది సాధ్యమైందని సీ ఎస్ శెట్టి తెలిపారు. ఆర్‌బీఐ కొత్తగా తెచ్చే నిబంధనలను దృష్టిలో ఉంచుకుని భవిష్యత్తులో సమస్యాత్మకంగా మారే లోన్స్‌పై అప్రమత్తంగా ఉండాలని భావిస్తున్నాం. అందుకే లోన్ రికవరీ కోసం కొత్త సిబ్బంది నియామకాలు చేపడుతున్నట్టు పేర్కొన్నారు.

## అతనికి పేదరికం తెలుసా?

**విజయ్ వ్యాఖ్యలపై క్లాస్‌మేట్ అభ్యంతరం**

చెన్నై: తమిళనాడు ముఖ్యమంత్రిగా బాధ్యతలు స్వీకరించిన నటుడు విజయ్, తన బాల్యం గురించి చేసిన వ్యాఖ్యలు వివాదాస్పదమయ్యాయి. తాను పేదరికం చూశానని, ఆకలి అంటే ఏంటో తెలుసని ఆయన చేసిన ప్రసంగాన్ని.. ఆయన క్లాస్ మేట్, ప్రముఖ స్క్రీన్ రైటర్ మను జోసెఫ్ 'బుల్‌షిట్' (అర్థం పర్థం లేని వాగుడు) అంటూ తీవ్రంగా విమర్శించారు. ఈ మేరకు మను జోసెఫ్ తన ఎక్స్ ఖాతాలో ఒక పోస్ట్ పెట్టారు. "విజయ్ మూడో తరగతిలో నా క్లాస్‌మేట్. మేమిద్దరం చెన్నైలోని సుప్రసిద్ధ లయోలా స్కూల్‌లో చదువుకున్నాం. అతని తండ్రి ఒక ఫిలింమేకర్. తన కొడుకును సినిమాల కోసమే తీర్చిదిద్దారు. అతను పేదరికంలో పెరిగానని చెప్పడంలో అర్థంలేదు" అని పేర్కొన్నారు. "చాలా మంది ఫిలింమేకర్ల లాగే విజయ్ తండ్రికి ఆర్థిక ఇబ్బందులు వచ్చి ఉండొచ్చు. కానీ అది తమిళనాడు స్థాయిలో పేదరికం కాదు. ధనవంతులు ఆర్థికంగా దెబ్బతినడాన్ని, నిజమైన పేదరికంతో పోల్చకూడదు. రెండూ వేర్వేరు" అని జోసెఫ్ వివరించారు. ఆదివారం సీఎంగా ప్రమాణ స్వీకారం చేసిన తర్వాత విజయ్ మాట్లాడుతూ.. "నేను ఒక సాధారణ సినీ అసిస్టెంట్ డైరెక్టర్ కొడుకుగా పుట్టాను. పేదరికం, ఆకలి నాకు తెలుసు. నేనేమీ రాజవంశం నుంచి రాలేదు, నేనూ మీలో ఒకడినే" అని భావోద్వేగంగా ప్రసంగించారు. విజయ్ తండ్రి ఎస్.ఏ. చంద్రశేఖర్ 1974 వరకు అసిస్టెంట్ డైరెక్టర్‌గా పనిచేసి, 1978లో దర్శకుడిగా మారారు. విజయ్ తన తండ్రి దర్శకత్వంలోనే బాలనటుడిగా, ఆ తర్వాత హీరోగా తెరంగేట్రం చేశారు. ఇటీవల జరిగిన ఎన్నికల్లో విజయ్ తమిళగ వెట్రి కళగం (టీవీకే) పార్టీ విజయం సాధించి, ఆయన ముఖ్యమంత్రి అయిన సంగతి తెలిసిందే.

## బెంగాల్‌లో జూన్ 1 నుంచి ఉచిత బస్సు

కోల్‌కతా: ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను వరుసగా అమలు చేస్తామని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి సువేందు అధికారి అన్నారు. జూన్ 1వ తేదీ నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, ఆయుష్మాన్ భారత్ ఆరోగ్య బీమా పథకాన్ని అమలు చేయనున్నట్లు చెప్పారు. మహిళలకు ఉచిత బస్సు ప్రయాణ పథకంతో ప్రజారవాణాపై ఆధారపడే లక్షలాది మంది మహిళలకు ప్రయోజనం కలుగుతుందని అన్నారు. ఇందులో ఉద్యోగినులు, విద్యార్థులు కూడా ఉంటారని తెలిపారు. పెరుగుతున్న జీవన వ్యయాల నేపథ్యంలో కుటుంబాలపై ఆర్థిక భారాన్ని తగ్గించే లక్ష్యంతో ఈ నిర్ణయం తీసుకున్నట్లు చెప్పారు. ఆయుష్మాన్ భారత్ పథకాన్ని కూడా వచ్చే నెల నుంచి అమలు చేస్తామని అన్నారు. రాష్ట్రంలో ప్రస్తుతం అమల్లో ఉన్న సామాజిక సంక్షేమ పథకాలన్నీ కొనసాగుతాయని స్పష్టం చేశారు. పాఠశాలల్లో ఉద్యోగాల భర్తీకి వయో పరిమితిని ఐదేళ్ళు పొడిగించే ప్రతిపాదనకు కేబినెట్ ఆమోదం తెలిపినట్లు వెల్లడించారు.




## స్టాలిన్ ఇంటికి విజయ్

**ఆలింగనం చేసుకుని శాలువాతో సత్కరించిన స్టాలిన్**

చెన్నై: తమిళనాడు నూతన ముఖ్యమంత్రి, తమిళగ వెట్రి కళగం (టీవీకే) అధినేత విజయ్.. డీఎంకే అధినేత, మాజీ సీఎం ఎంకే స్టాలిన్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. సోమవారం నాడు అసెంబ్లీలో ఎమ్మెల్యేగా ప్రమాణ స్వీకారం చేసిన అనంతరం, ఆయన నేరుగా చెన్నైలోని స్టాలిన్ నివాసానికి వెళ్లారు. తన నివాసానికి వచ్చిన ముఖ్యమంత్రి విజయ్‌ను స్టాలిన్ సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా విజయ్‌ను ఆత్మీయ ఆలింగనం చేసుకుని, శాలువాతో సత్కరించారు. ఈ భేటీలో స్టాలిన్ కుమారుడు, మాజీ మంత్రి ఉదయనిధి స్టాలిన్ కూడా పాల్గొన్నారు. డీఎంకే మిత్రపక్షాలైన కాంగ్రెస్, వీసీకే, సీపీఐ, సీపీఎంల మద్దతుతోనే విజయ్ ప్రభుత్వం ఏర్పాటు చేసిన విషయం తెలిసిందే. టీవీకే పార్టీకి మద్దతు ఇచ్చే విషయంలో తమ మిత్రపక్షాలకు స్టాలిన్ పూర్తి స్వేచ్ఛ కల్పించారు. ఈ నేపథ్యంలోనే, ముఖ్యమంత్రి పీఠం ఎక్కేందుకు పరోక్షంగా సహకరించిన స్టాలిన్‌కు కృతజ్ఞతలు తెలిపేందుకే విజయ్ ఆయనను కలిసినట్లు తెలుస్తోంది. సీఎం బాధ్యతలు చేపట్టాక విజయ్, స్టాలిన్‌ను కలవడం ఇదే తొలిసారి. ఈ భేటీ తమిళ రాజకీయాల్లో ఆసక్తిని రేకెత్తించింది.

## ఇంధనానికి ఢోకా లేదు: కేంద్రం

న్యూఢిల్లీ: అంతర్జాతీయ మార్కెట్లో ఇంధన ధరల్లో తీవ్ర అస్థిరత ఉన్నప్పటికీ, మన దేశంలో మాత్రం ఇంధన సరఫరా సజావుగా సాగుతోందని పెట్రోలియం మరియు సహజవాయువు మంత్రిత్వ శాఖ జాయింట్ సెక్రటరీ సుజాత శర్మ తెలిపారు. దేశ ప్రజలు పొదుపు మంత్రాన్ని పాటించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ పిలుపునిచ్చిన విషయం తెలిసిందే. మరోవైపు, పశ్చిమాసియాలో యుద్ధ ప్రభావం కొనసాగుతోంది. ఈ నేపథ్యంలో రాజ్‌నాథ్ సింగ్ అధ్యక్షతన కీలక భేటీ నిర్వహించారు. అనంతరం సుజాత శర్మ మాట్లాడుతూ, చమురు రంగ కంపెనీలకు ప్యాకేజీ ఇచ్చే ఉద్దేశం లేదని అన్నారు. భారత మార్కెట్లో సాధారణ వినియోగదారులకు ఎటువంటి ఇబ్బందులు కలగకుండా ప్రభుత్వం తీసుకున్న సమర్థవంతమైన చర్యల వల్ల దేశంలో ముడి చమురు నిల్వలు సంతృప్తికరంగా ఉన్నాయని తెలిపారు. దేశంలో ప్రస్తుతం ఆయిల్ రిఫైనరీలు పూర్తిస్థాయిలో పనిచేస్తున్నాయని అన్నారు. మన దేశంలో పెట్రోల్, డీజిల్ లేదా గ్యాస్ కొరత లేదని స్పష్టం చేశారు. స్టాక్ తగినంత అందుబాటులో ఉందని తెలిపారు. గృహ అవసరాల కోసం ఎల్పీజీ సరఫరాను నిరంతరం కొనసాగిస్తున్నామని అన్నారు. గడిచిన మూడు రోజుల్లో 1 కోటి 14 లక్షల బుకింగ్‌లకు గాను 1 కోటి 26 లక్షల ఎల్పీజీ సిలిండర్లను గృహాలకు పంపిణీ చేసినట్లు తెలిపారు. వాణిజ్య సిలిండర్ల విక్రయాలు 17,000 టన్నులు, ఆటో ఎల్పీజీ విక్రయాలు 762 టన్నులు దాటినట్లు వెల్లడించారు. దేశ ప్రజలంతా పెట్రోల్, డీజిల్, గ్యాస్ వినియోగాన్ని తగ్గించాలని ప్రధాని మోదీ పిలుపునిచ్చారని గుర్తు చేశారు.





# భారత్‌ను లొంగదీసే శక్తి లేనేలేదు

**పోఖ్రాన్ అణు పరీక్షలపై ప్రధాని మోదీ**

**సోమనాథ్ ఆలయ 75వ వార్షికోత్సవ వేడుకకు హాజరు**

సోమనాథ్: భారత్‌ను తలవంచేలా చేసే శక్తి ప్రపంచంలో ఏదీ లేదని ప్రధానమంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. 1998లో పోఖ్రాన్‌లో జరిపిన అణు పరీక్షలను గుర్తుచేస్తూ, భారత సంకల్పం ఎంత దృఢమైనదో ప్రపంచానికి ఆనాడే తెలిసొచ్చిందని అన్నారు. సోమవారం గుజరాత్‌లోని సోమనాథ్ ఆలయంలో జరిగిన 'సోమనాథ్ అమృత్ మహోత్సవ్' వేడుకల్లో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. 1998 మే 11న భారత శాస్త్రవేత్తలు పోఖ్రాన్‌లో అణు పరీక్షలు జరిపి దేశ సత్తాను ప్రపంచానికి చాటారని ప్రధాని మోదీ గుర్తుచేశారు. ఆ పరీక్షల తర్వాత ప్రపంచ దేశాలు మనపై అనేక ఆంక్షలు విధించి, ఆర్థికంగా ఇబ్బంది పెట్టాలని చూశాయని అన్నారు. అయినప్పటికీ భారత్ వెనక్కి తగ్గలేదని, మే 13న మరోసారి పరీక్షలు జరిపి తన రాజకీయ సంకల్పాన్ని నిరూపించుకుందని వివరించారు. "మనం వేరే మట్టితో తయారైన వాళ్ళం" అంటూ ఆనాటి ధైర్యాన్ని కొనియాడారు. సోమనాథ్ ఆలయం గురించి మాట్లాడుతూ.. 75 ఏళ్ల క్రితం జరిగిన ఆలయ పునరుద్ధరణ కేవలం ఒక సాధారణ కార్యక్రమం కాదని, అది భారత సాంస్కృతిక స్వేచ్ఛా ప్రకటన అని మోదీ అభివర్ణించారు. చరిత్రలో ఎన్నోసార్లు ఆలయాన్ని ధ్వంసం చేసినా, ప్రతిసారీ పునర్నిర్మించామని, ఇది భారత విశ్వాసానికి ఉన్న బలమని పేర్కొన్నారు. స్వాతంత్ర్యం తర్వాత సోమనాథ్ ఆలయ నిర్మాణంలోనూ బుజ్జగింపు రాజకీయాలు జరిగాయని, సర్దార్ పటేల్ వంటి వారి ప్రయత్నాలను నెహ్రూ వ్యతిరేకించారని విమర్శించారు. ఇదే తరహా రాజకీయాలు అయోధ్య రామమందిర నిర్మాణం విషయంలోనూ కొనసాగాయని అన్నారు. పునర్నిర్మించిన సోమనాథ్ ఆలయానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా ఈ అమృత్ మహోత్సవ్ వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రధాని మోదీ ఆలయంలో విశేష మహా పూజ, కుంభాభిషేకం, ధ్వజారోహణ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. అనంతరం హెలికాప్టర్ల ద్వారా ఆలయ గోపురంపై పూలవర్షం కురిపించారు.





## బెడ్ సైడ్ కార్మికులపై శాడిజం

**విధులకు హాజరైనా గైర్హాజరు!.. జనగామ ఆస్పత్రి ఏజెన్సీ నిర్వాకం**

**ఎస్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు సైదయ్య మండిపాటు**

జనగామ, మే 11 (ఈవార్తలు): అసలే చాలీచాలని జీతాలు.. రోగుల మధ్య జీవనం.. రోగులతోనే సహవాసం.. శానిటేషన్ నుంచి పేషెంట్ కేర్ దాకా ఊపిరాడని సేవలు.. అయినా, చిరునవ్వుతో వైద్య సేవ. కానీ, వాళ్ల రక్త మాంసాలను కాల్చుకొని తింటోంది ఏజెన్సీ. విధులకు హాజరైనా గైర్హాజరు పెట్టి శ్రమదోపిడీకి పాల్పడుతోందట. ఈ అమానుష తీరు జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో చోటుచేసుకుంటోందని వైద్య కార్మికులు వాపోతున్నారు. ఏజెన్సీదే పెత్తనం కావడంతో దళారీది ఇష్టారాజ్యం అయిపోయిందని వాపోతున్నారు. ఈ వ్యవహారంపై ఎస్పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు కుర్రి సైదయ్య తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్మిక చట్టం ప్రకారం ప్రతి కార్మికుడితో 8 గంటల డ్యూటీ చేయించాలని, కానీ జనగామ ఆస్పత్రిలో తీరు అత్యంత దారుణంగా ఉందని మండిపడ్డారు. ఏజెన్సీ తీరు ఆక్షేపనీయంగా ఉందని, ఆధారాలతో వైద్యారోగ్య మంత్రికి ఫిర్యాదు చేయనున్నట్లు తెలిపారు. కార్మికులపై దుర్మార్గపు చర్యలకు పాల్పడితే సహించేది లేదని రాష్ట్ర ప్రధాన కార్యదర్శి చిన్న బోస్క నరేష్ హెచ్చరించారు. హాజరులో అవకతవకలు, పని విధానంలో వివక్ష సహించేది లేదని తేల్చి చెప్పారు. కాగా, జనగామ ప్రభుత్వ ఆస్పత్రిలో వైద్య కార్మికుల నూతన కమిటీ ఏర్పాటైంది. ఈ కమిటీకి అధ్యక్షుడిగా రఘు, ప్రధాన కార్యదర్శిగా అజయ్, ఉపాధ్యక్షులుగా స్వామి, కవిత, సహాయ కార్యదర్శులుగా బాలరాజు, ఉప్పలయ్య, స్వప్న, కోశాధికారిగా రూతు, ప్రచార కార్యదర్శిగా సునీత, స్వప్న, సోషల్ మీడియా కన్వీనర్‌గా అనూష, సుశీల, సభ్యులుగా బాలమణి , కాంతమ్మ, సరిత , సిద్దల్, రాజును ఎన్నుకున్నారు. ఈ కార్యక్రమంలో ఎస్పీఎస్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాతంగి అనిల్ కుమార్, రాష్ట్ర సహాయ కార్యదర్శి గొర్రె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



## నీళ్లు కావాలంటే రూ.3,500 ఇవ్వాలి

**డబుల్ బెడ్రూం కాలనీలో నీటి వసూళ్లు**

**ప్రజావాణిలో మహిళల ఫిర్యాదు**

జగిత్యాల టౌన్, మే 11 (ఈవార్తలు): నిరుపేదల సొంతింటి కలను నెరవేర్చేందుకు ప్రభుత్వం నిర్మించిన జగిత్యాల అర్బన్ డబుల్ బెడ్‌రూమ్ కాలనీలో నీటి సరఫరా పేరుతో అక్రమ వసూళ్లు జరుగుతున్నాయని బాధితులు ఆరోపించారు. సోమవారం కలెక్టరేట్‌లో నిర్వహించిన ప్రజావాణి కార్యక్రమంలో కాలనీకి చెందిన మహిళలు భారీ సంఖ్యలో హాజరై అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్‌కు ఫిర్యాదు చేశారు. కాలనీలో నీటి సరఫరాను పర్యవేక్షిస్తున్న అయూబ్ ఖాన్ అనే వ్యక్తి ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా వ్యవహరిస్తున్నాడని మహిళలు ఆరోపించారు. “నీళ్లు రావాలంటే రూ. 3,500 మామూళ్లు ఇవ్వాల్సిందే” అంటూ బహిరంగంగా డబ్బులు డిమాండ్ చేస్తున్నాడని తెలిపారు. లంచం ఇవ్వని ఇళ్లకు నీటి సరఫరా నిలిపివేస్తూ, పైపులైన్ మరమ్మతుల పేరుతో అక్రమ వసూళ్లు చేస్తున్నారని వాపోయారు. కాలనీలో పారిశుధ్య సమస్యలు కూడా తీవ్రంగా ఉన్నాయని, మురుగు నీరు రోడ్లపై నిలిచి ప్రజలు ఇబ్బందులు పడుతున్నారని పేర్కొన్నారు. ఈ వ్యవహారంపై స్పందించిన అదనపు కలెక్టర్ బి. రాజా గౌడ్, నీటి సరఫరాలో జరుగుతున్న అవకతవకలపై విచారణ జరిపి నివేదిక సమర్పించాలని మున్సిపల్ అధికారులను ఆదేశించారు. బాధ్యులపై చర్యలు తీసుకోకపోతే ఆందోళనను మరింత ఉధృతం చేస్తామని బాధితులు హెచ్చరించారు.



## సమ్మర్ క్యాంపులను ఉపయోగించుకోవాలి

**మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పిలుపు**

వెల్గటూర్, మే 11 (ఈవార్తలు): ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక సదుపాయాల కల్పనకు రాష్ట్ర ప్రభుత్వం పెద్దపీట వేస్తోందని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం వెల్గటూర్ మండలం కుమ్మరిపల్లి మోడల్ స్కూల్లో నిర్వహించిన సమ్మర్ క్యాంప్‌ను ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి విద్యార్థులకు నాణ్యమైన విద్య అందించాలనే లక్ష్యంతో ప్రభుత్వ విద్యా సంస్థల్లో మౌలిక వసతుల అభివృద్ధికి నిధులు కేటాయిస్తున్నారని తెలిపారు. పేద విద్యార్థులకు కార్పొరేట్ స్థాయి విద్య అందించేందుకు ప్రతి నియోజకవర్గంలో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్స్ నిర్మిస్తున్నామని చెప్పారు. కుమ్మరిపల్లి మోడల్ స్కూల్ విద్యార్థులు జిల్లాలో ప్రథమ స్థానం సాధించడం ఆనందంగా ఉందని, విద్యార్థులు మరియు ఉపాధ్యాయులను అభినందించారు. పాఠశాలలో కిచెన్ షెడ్ నిర్మాణానికి ఇప్పటికే రూ. 10 లక్షలు మంజూరు చేశామని, విద్యార్థులకు అవసరమైన గ్రౌండ్ లెవలింగ్ పనులు కూడా చేపడతామని హామీ ఇచ్చారు.

## డబ్బుల కోసం బలవంతం లేదు

**జేసీబీ యూనియన్ వివరణ**

వెల్గటూర్, మే 11 (ఈవార్తలు): వెల్గటూర్ మండల జేసీబీ యూనియన్‌పై వస్తున్న ఆరోపణలను యూనియన్ సభ్యులు ఖండించారు. ఎవరినీ బలవంతంగా డబ్బులు చెల్లించమని ఒత్తిడి చేయలేదని స్పష్టం చేశారు. జేసీబీ యూనియన్‌ను 2024లో రిజిస్ట్రేషన్ చేసుకున్నామని, ప్రస్తుతం యూనియన్‌లో రూ. 5.40 లక్షల నిధులు ఉన్నాయని తెలిపారు. కొత్తగా జేసీబీలు కొనుగోలు చేసిన వారిని సభ్యత్వం తీసుకోవాలని మాత్రమే కోరుతున్నామని పేర్కొన్నారు. స్తంభంపెల్లి గ్రామానికి చెందిన పాకల నరేష్‌ను కూడా సభ్యత్వం గురించి అడిగామని, కానీ ఎటువంటి ఒత్తిడి చేయలేదన్నారు. యూనియన్‌పై తప్పుడు ఆరోపణలు చేయడం సరైంది కాదని సభ్యులు తెలిపారు.

## మోదీ విజ్ఞప్తులు వైఫల్యాలే: రాహుల్ గాంధీ

న్యూఢిల్లీ: ప్రధాని నరేంద్ర మోదీపై కాంగ్రెస్ అగ్రనేత, లోక్‌సభలో విపక్ష నాయకుడు రాహుల్ గాంధీ తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు. పశ్చిమాసియా సంక్షోభం నేపథ్యంలో ప్రజలు త్యాగాలు చేయాలంటూ ప్రధాని చేసిన విజ్ఞప్తి ‘వైఫల్యానికి నిదర్శనం’ అని ఆయన అభివర్ణించారు.

# బండి సంజయ్ రాజీనామా చేయాలి

**జీవన్‌రెడ్డి డిమాండ్.. కేంద్ర మంత్రిపై ఫైర్**



జగిత్యాల బ్యూరో, మే 11 (ఈవార్తలు): రాష్ట్రంలో సీఎం రేవంత్ రెడ్డి, కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ మధ్య ‘ఫెవికల్ బంధం’ కొనసాగుతోందని బీఆర్ఎస్ ప్రధాన కార్యదర్శి, మాజీ మంత్రి టి. జీవన్‌రెడ్డి తీవ్ర విమర్శలు చేశారు. మైనర్ బాలిక ఘటనలో బండి భగీరథపై కఠిన చర్యలు తీసుకోవాలని, బండి సంజయ్ నైతిక బాధ్యత వహిస్తూ కేంద్ర మంత్రి పదవికి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ పార్టీ కార్యాలయంలో జిల్లా అధ్యక్షుడు కల్వకుంట్ల విద్యాసాగర్ రావు, మాజీ జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్, పట్టణ అధ్యక్షుడు ఆయిల్నేని వెంకటేశ్వరరావుతో కలిసి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీజేపీ క్రమశిక్షణ గల పార్టీ అని చెప్పుకునే బండి సంజయ్, తన కుటుంబ సభ్యుడిపై వచ్చిన ఆరోపణల విషయంలో ఎందుకు స్పందించడం లేదని ప్రశ్నించారు. మైనర్ బాలిక ఘటనలో చట్ట ప్రకారం కఠిన సెక్షన్లు నమోదు చేయాల్సి ఉండగా, ప్రభుత్వం నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. నేరానికి అనుగుణంగా చర్యలు తీసుకోకుండా కప్పిపుచ్చే ప్రయత్నం జరుగుతోందని ఆరోపించారు. బండి భగీరథ చేసిన నేరానికి కఠిన శిక్ష పడే అవకాశం ఉందని, అయినప్పటికీ రాష్ట్ర ప్రభుత్వం సరైన దర్యాప్తు చేయడం లేదన్నారు. కేంద్ర హోంశాఖ సహాయ మంత్రిగా ఉన్న బండి సంజయ్ కుటుంబ సభ్యుడే ఆరోపణలు ఎదుర్కొంటున్నప్పటికీ, నైతిక విలువలు పాటించడం లేదని విమర్శించారు. రాష్ట్రంలో ఏ ఆడబిడ్డకు అన్యాయం జరిగినా బీఆర్ఎస్ పార్టీ అండగా నిలుస్తుందని జీవన్‌రెడ్డి స్పష్టం చేశారు. ప్రజా జీవితంలో ఉన్న నాయకులు పారదర్శకంగా ఉండాలని, మహిళల భద్రత విషయంలో ప్రభుత్వం బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు. మైనర్ బాలిక ఘటనపై కాంగ్రెస్ పార్టీ, పీసీసీ నాయకత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. కేసులో ఉద్దేశపూర్వకంగా సరైన సెక్షన్లు నమోదు చేయని అధికారులపై కూడా చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

# బండి భగీరథ్‌ను అరెస్టు చేయాలి

**బీఆర్ఎస్, టీఆర్ఎస్వై, టీఆర్ఎస్వీ ధర్నా**



జగిత్యాల టౌన్, మే 11 (ఈవార్తలు): బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో టీఆర్ఎస్వై, టీఆర్ఎస్వీ నాయకులు జగిత్యాల తహసీల్ చౌరస్తా వద్ద సోమవారం భారీ ధర్నా నిర్వహించారు. మైనర్ బాలిక ఘటనలో బండి భగీరథ్‌ను వెంటనే అరెస్టు చేసి బాధితురాలికి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా దావా సురేష్ మరియు ఇతర నాయకులు మాట్లాడుతూ పోక్సో కేసుల్లో 24 గంటల్లోనే అరెస్టులు చేయాల్సి ఉండగా, మూడు రోజులైనా చర్యలు తీసుకోకపోవడం రాష్ట్ర ప్రభుత్వ వైఫల్యమని విమర్శించారు. కేంద్ర మంత్రి బండి సంజయ్‌ను పదవి నుంచి తొలగించాలని డిమాండ్ చేశారు. హోంశాఖ బాధ్యతలు చేపట్టిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రాష్ట్రంలో శాంతిభద్రతల విషయంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆరోపించారు. ఇటీవల మాజీ ఐపీఎస్ అధికారి భార్య హత్య కేసులో కూడా ఇప్పటివరకు పురోగతి లేకపోవడం దారుణమన్నారు. మైనర్ బాలికకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో పెద్ద ఎత్తున ఉద్యమాలు కొనసాగిస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు దేవేందర్ నాయక్, సమల్ల రాజశేఖర్, హరీష్, దుర్గయ్య, శీలం ప్రవీణ్, వెంకటేశ్వరరావు, ఐల్నేని ఆనంద్ రావు, గంగాధర్, అల్లల ఆనంద్ రావు, శ్రీరాముల గంగాధర్, నరేష్ గౌడ్, నేహాల్, నక్క జీవన్, కిషోర్, నీలి ప్రతాప్, కచ్చు హరీష్, గుండా మధు, కమల్, వసీం, సావన్, రమేష్, సందీప్, సన్నిత్ రావు, హరీష్ కల్లూరి, భలే చందు, గంగారెడ్డి, కస్తూరి గంగాధర్, బొంగని పవన్, అజయ్, వంశీ, శశి, సాయి తదితరులు పాల్గొన్నారు.

## డుకాటీ డెలివరీ స్టార్ట్

ముంబై: ఇటాలియన్ మోటార్ సైకిల్ తయారీ సంస్థ డుకాటీ అత్యంత ప్రీమియం, పరిమిత ఎడిషన్ బైక్ ‘డుకాటీ పనిగేల్ వీ4 లంబోర్గిని’ని తీసుకువచ్చింది. దీని ఎక్స్ షోరూమ్ ధర రూ. 1 కోటి. ఈ లిమిటెడ్ ఎడిషన్ సూపర్ బైక్ కోసం ఇప్పటికే బుకింగ్స్ పూర్తయినట్లు డుకాటీ తెలిపింది. మొదటి మోటార్ సైకిల్‌ను ముంబైలో డెలివరీ చేసినట్లు వెల్లడించింది. పనిగేల్ వీ4 లంబోర్గిని బైక్‌లను ప్రపంచవ్యాప్తంగా 630 యూనిట్లు మాత్రమే ఉత్పత్తి చేస్తారు. భారత్‌కు వచ్చిన అత్యంత అరుదైన మోటార్ సైకిళ్లలో ఇది ఒకటిగా నిలుస్తుంది. డుకాటీ మరింత ప్రత్యేకమైన ‘స్పెషాలీ క్లయింటి’ ఎడిషన్‌ను కూడా తయారు చేస్తోంది. వీటిని ప్రపంచవ్యాప్తంగా 63 యూనిట్లను మాత్రమే తయారు చేస్తోంది. ప్రత్యేకంగా లంబోర్గిని కార్ల యజమానుల కోసం వీటిని తయారు చేస్తుండగా, యజమానులు తమ కార్ల రంగుల్లోనే బైక్‌ను కూడా కాన్ఫిగర్ చేసుకునే వెసులుబాటు ఉంది. డుకాటీ పనిగేల్ వీ4 ఎస్, లంబోర్గిని రెవుయెల్టో స్ఫూర్తితో పఃనిగేల్ వీ4ను తీర్చిదిద్దారు. డుకాటీ స్ట్రీట్ ఫైటర్ వీ4 లంబోర్గిని, డయావెల్ 1260 లంబోర్గిని తర్వాత, డుకాటీ, లంబోర్గిని కలిసి తీసుకువచ్చిన మూడో బైక్ డుకాటీ పనిగేల్ వీ4 లంబోర్గిని. ఈ మోటార్ సైకిల్‌ను డుకాటీ సెంట్రో స్టైల్ మరియు లంబోర్గిని సెంట్రో స్టైల్ డిజైన్ బృందాలు సంయుక్తంగా అభివృద్ధి చేశాయి. ఈ బైక్‌లో ఎక్స్‌పోజ్డ్ కార్బన్ ఫైబర్‌తో పాటు వెర్డే స్కాండల్, గ్రిజియో టెలెస్టో, గ్రిజియో అచెసో యాక్సెంట్‌లు ఉంటాయి. ఫెయిరింగ్, మడ్ గార్డ్స్, హీల్ గార్డ్స్, చైనా గార్డ్, ఎగ్జాస్ట్ ప్రొటెక్షన్, ట్యాంక్ ప్రొటెక్షన్, రేడియేటర్ డక్ట్ వంటి భాగాలన్నీ కార్బన్ ఫైబర్‌తో తయారు చేసినట్లు తెలిపింది. ఈ బైక్‌కు 1,103సీసీ డెస్మోసెడిసి స్ట్రాడేల్ వీ4 ఇంజన్‌ను అమర్చారు. దీనికి 6 స్పీడ్ గేర్ బాక్సు, స్లిప్పర్ డ్రై క్లచ్‌లను ఏర్పాటు చేశారు. పనిగేల్ వీ4 లంబోర్గిని బైక్ బరువు 185 కిలోలు ఉంటుంది. పనిగేల్ సిరీస్ లో వచ్చిన అత్యంత తేలికైన మరియు అత్యంత పవర్‌ఫుల్ బైక్ ఇది.



## బండి బాధితురాలికి న్యాయం చేయాలి

**ఎమ్మెల్యే కల్వకుంట్ల సంజయ్.. కోరుట్లలో బీఆర్ఎస్ భారీ ధర్నా**

కోరుట్ల, మే 11 (ఈవార్తలు): మైనర్ బాలికకు న్యాయం చేయాలని, నిందితుడిని వెంటనే అరెస్ట్ చేసి పోక్సో చట్టం ప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేస్తూ కోరుట్ల ఎమ్మెల్యే డాక్టర్ కల్వకుంట్ల సంజయ్ ఆధ్వర్యంలో బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు కోరుట్ల పట్టణంలో భారీ ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సంజయ్ మాట్లాడుతూ ఘటన జరిగిన మూడు రోజులైనా ప్రభుత్వం స్పందించకపోవడం దురదృష్టకరమన్నారు. మైనర్ బాలికకు న్యాయం చేయాల్సిన బాధ్యత ప్రభుత్వంపై ఉందని పేర్కొన్నారు. “రక్షకుడే భక్షకుడు అయ్యాడు” అంటూ తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. పోక్సో చట్టం ప్రకారం 24 గంటల్లోనే అరెస్ట్ చేయాల్సి ఉండగా ఇప్పటివరకు చర్యలు తీసుకోకపోవడం వెనుక రాజకీయ ఒత్తిళ్లు ఉన్నాయా అనే అనుమానాలు వ్యక్తమవుతున్నాయని అన్నారు. సాధారణ వ్యక్తులపై వెంటనే చర్యలు తీసుకునే పోలీసులు, అధికార పార్టీలకు చెందిన వారిపై ఎందుకు మౌనం పాటిస్తున్నారని ప్రశ్నించారు. బండి సంజయ్‌ను కేంద్ర మంత్రి పదవి నుంచి తొలగించాలని, బాధిత బాలికకు పూర్తి రక్షణ కల్పించి న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ముఖ్యమంత్రి, కేంద్ర మంత్రులు ఇప్పటివరకు స్పందించకపోవడం బాధాకరమన్నారు. మహిళల భద్రతపై పెద్ద పెద్ద మాటలు చెప్పే నాయకులు ఇప్పుడు ఎందుకు మౌనం వహిస్తున్నారని ప్రశ్నించిన ఎమ్మెల్యే, బాలికకు న్యాయం జరిగే వరకు బీఆర్ఎస్ పార్టీ తరఫున పోరాటం కొనసాగుతుందని స్పష్టం చేశారు.



## కోరుట్లలో పేకాట స్థావరంపై పోలీసుల దాడి

**ఏడుగురి అరెస్టు.. నగదు, సెల్‌ఫోన్, బైక్ స్వాధీనం**

కోరుట్ల, మే 11 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కోరుట్ల పట్టణంలోని జమ్మి గద్దె సమీపంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై పోలీసులు ఆకస్మిక దాడి నిర్వహించి ఏడుగురిని అదుపులోకి తీసుకున్నారు. మరో ముగ్గురు పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. పేకాట జరుగుతున్నట్లు వచ్చిన విశ్వసనీయ సమాచారం మేరకు పోలీసులు దాడి చేసి, అక్కడ పేకాట ఆడుతున్న వ్యక్తులను పట్టుకున్నారు. వారి వద్ద నుంచి రూ. 8,500 నగదు, ఏడు సెల్‌ఫోన్లు, తొమ్మిది మోటార్ సైకిళ్లను స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనకు సంబంధించి మొత్తం పదిమందిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టినట్లు పోలీసులు వెల్లడించారు. ఈ దాడిలో ఎస్ఐతో పాటు కోరుట్ల పోలీస్ స్టేషన్ సిబ్బంది శివాజీ, ఎల్లయ్య, గంగాధర్, రామకోటి పాల్గొన్నారు.

## కొండగట్టు గిరి ప్రదక్షిణకు అన్ని సౌకర్యాలు: అడ్లూరి

**హనుమాన్ జన్మోత్సవాల ఏర్పాట్లపై ప్రత్యేక దృష్టి**



మల్యాల, మే 11 (ఈవార్తలు): కొండగట్టు ఆంజనేయస్వామి గిరి ప్రదక్షిణకు అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డితో మాట్లాడి నిధుల విడుదలకు కృషి చేస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ శాఖ మంత్రి అడ్లూరి లక్ష్మణ్ కుమార్ తెలిపారు. సోమవారం జగిత్యాల జిల్లా మల్యాల మండలంలోని కొండగట్టు అంజన్న ఆలయంలో మంత్రి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పెద్ద హనుమాన్ జయంతి సందర్భంగా ఆలయానికి చేరుకున్న మంత్రి అడ్లూరికి ఆలయ పూజారులు పూర్ణకుంభ స్వాగతం పలికారు. అనంతరం స్వామివారికి పట్టు వస్త్రాలు సమర్పించి ప్రత్యేక దర్శనం చేసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ హనుమాన్ జయంతి వేడుకలకు వచ్చే భక్తులకు ఎలాంటి అసౌకర్యాలు కలగకుండా దేవాదాయ, పోలీసు శాఖల సమన్వయంతో అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. గిరి ప్రదక్షిణలో పాల్గొనే భక్తులకు తాగునీరు, భద్రత, వైద్య సదుపాయాలు వంటి అవసరమైన సౌకర్యాలు కల్పించేందుకు చర్యలు తీసుకుంటామని పేర్కొన్నారు. కొండగట్టు అంజన్న ఆశీస్సులు రాష్ట్ర ప్రజలపై, ప్రభుత్వంపై ఉండాలని ఆకాంక్షించిన మంత్రి, అధికారులు స్థానికంగా ఉండి భక్తులకు ఇబ్బందులు తలెత్తకుండా ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు.



## సౌడాలమ్మ బోనాల వేడుకల్లో వసంత పూజలు

జగిత్యాల రూరల్, మే 11 (ఈవార్తలు): జగిత్యాల రూరల్ మండలం వంజరిపల్లె గ్రామంలో నిర్వహించిన శ్రీ దేవి సౌడాలమ్మ పట్నాలు, బోనాల పండుగ కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఈ వేడుకలకు జిల్లా తొలి జడ్పీ చైర్‌పర్సన్ దావ వసంత సురేష్ హాజరై అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామ ప్రజల సుఖశాంతులు, ఆయురారోగ్యాల కోసం అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు. పండుగలో మహిళలు, భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని బోనాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో ఆనంద్ రావు, రవి, మధు, గంగాధర్, శీలం ప్రవీణ్, చిన్న గంగారం, గంగారెడ్డి, సన్నిత్ రావు, మహిళలు, భక్తులు తదితరులు పాల్గొన్నారు.

## మన రూటు సపరేటు

**ఏఐతో మరింత ఉత్పాదకత: గౌతమ్ అదానీ**

ముంబై: భారత్ ప్రయాణం అమెరికా లేదా చైనా మార్గంలో ఉండదని, మనం భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా కాకుండా.. సజీవంగా, ఎదుగుతున్న, డిమాండ్ ఉన్న భారతదేశం కోసం పునాదులు వేస్తున్నామని అదానీ గ్రూప్ ఛైర్మన్ గౌతమ్ అదానీ స్పష్టం చేశారు. సోమవారం ‘సీఐఐ వార్షిక బిజినెస్ సమ్మిట్ 2026’లో ఆయన ప్రసంగిస్తూ, భారత వృద్ధి పథంపై తన అభిప్రాయాలను పంచుకున్నారు. భారత వృద్ధి సాధారణమైనది కాదని, ఇది కాంపౌండింగ్ పద్ధతిలో వేగంగా దూసుకెళుతోందని అదానీ వివరించారు. “స్వాతంత్ర్యం తర్వాత 2 ట్రిలియన్ డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మారడానికి భారత్‌కు 67 ఏళ్లు పడితే, తర్వాతి 2 ట్రిలియన్ డాలర్లను కేవలం 12 ఏళ్లలోనే జోడించగలిగాం. ఈ వేగంతో వెళితే, ప్రతి దశాబ్దానికి భారత్ తన జీడీపీకి ఒక కొత్త యూరోపియన్ ఆర్థిక వ్యవస్థకు సమానమైన మొత్తాన్ని జోడిస్తుంది. ఇది లీనియర్ వృద్ధి కాదు, కాంపౌండింగ్ యాక్సిలరేషన్” అని ఆయన నొక్కి చెప్పారు.

## గృహగణనలో ఎమ్మెల్యే సంజయ్

**జగిత్యాలలో అధికారులతో కలిసి హాజరు**


జగిత్యాల, మే 11 (ఈవార్తలు): కేంద్ర ప్రభుత్వం చేపట్టిన భారతదేశ జనాభా గణన 2027 కార్యక్రమంలో భాగంగా గృహ జాబితా, గృహ గణన ప్రారంభ కార్యక్రమం జగిత్యాల పట్టణంలో సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమాన్ని జగిత్యాల ఎమ్మెల్యే డా. సంజయ్ కుమార్ తన నివాసం వద్ద ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశ, రాష్ట్ర అభివృద్ధికి ఖచ్చితమైన జనాభా గణాంకాలు ఎంతో కీలకమని పేర్కొన్నారు. జనాభా గణన ద్వారా ప్రజల ఆర్థిక, సామాజిక పరిస్థితులపై సమగ్ర సమాచారం ప్రభుత్వానికి అందుతుందని తెలిపారు. ఆ వివరాల ఆధారంగా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రభుత్వం సమర్థవంతంగా అమలు చేస్తుందని చెప్పారు. ప్రజలందరూ గృహ గణన ప్రక్రియలో చురుకుగా పాల్గొని తమ వివరాలను సక్రమంగా నమోదు చేయించాలని ఎమ్మెల్యే విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో కమిషనర్ సత్య ప్రణవ్, ఏఎంసీ చైర్మన్ గడ్డం నారాయణరెడ్డి, కౌన్సిలర్ ప్రశాంత్ రావు, నక్కల రవీందర్ రెడ్డి, ఎన్యూమరేటర్లు ప్రసాద్ రావు, మల్హాల్ రావు, శ్రీనివాస్, జాఫర్, మల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



వయ్యారి చిత్రం



అహానా కుమ్రా




## 18న పెద్ది ట్రైలర్ రిలీజ్

గ్లోబల్ స్టార్ రామ్ చరణ్, దర్శకుడు బుచ్చిబాబు సనా కాంబినేషన్‌లో రూపొందుతున్న భారీ పీరియాడిక్ స్పోర్ట్స్ యాక్షన్ డ్రామా 'పెద్ది'. ప్రస్తుతం ఈ సినిమాకు సంబంధించిన వార్తలు సోషల్ మీడియాలో విపరీతంగా ట్రెండ్ అవుతున్నాయి. రామ్ చరణ్ సరసన బాలీవుడ్ భామ జాన్వీ కపూర్ నటిస్తుండటంతో ఈ ప్రాజెక్టుపై ఇప్పటికే దేశవ్యాప్తంగా భారీ అంచనాలు నెలకొన్నాయి. వృద్ధి సినిమాస్, మైత్రీ మూవీ మేకర్స్ బ్యానర్లపై అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్మిస్తున్న ఈ చిత్రం జూన్ 4న థియేటర్లలోకి రాబోతోంది. ఈ నేపథ్యంలో చిత్రబృందం ప్రమోషన్ల వేగాన్ని పెంచింది. ఇప్పటివరకు విడుదలైన రెండు పాటలు, గ్లింప్స్ సినిమాపై భారీ హైప్‌ను క్రియేట్ చేశాయి. అయితే రామ్ చరణ్ అభిమానులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న ట్రైలర్ అప్‌డేట్‌ను మూవీ టీమ్ అధికారికంగా ప్రకటించింది. ఈ సినిమా ట్రైలర్‌ను మే 18న విడుదల చేయబోతున్నట్లు వెల్లడించారు.




## వారణాసి తాజా షెడ్యూల్ స్టార్ట్

సూపర్‌స్టార్ మహేష్ బాబు, దర్శకధీరుడు ఎస్.ఎస్. రాజమౌళి కాంబినేషన్‌లో వస్తున్న భారీ యాక్షన్ అడ్వెంచర్ చిత్రం 'వారణాసి'పై కీలక అప్‌డేట్ వచ్చింది. ఈ సినిమాలో నటిస్తున్న గ్లోబల్ స్టార్ ప్రియాంక చోప్రా తాజా షెడ్యూల్ లో షూటింగ్‌లో పాల్గొన్నారు. ఈ విషయాన్ని ఆమె స్వయంగా తన ఇన్‌స్టాగ్రామ్ ఖాతా ద్వారా వెల్లడించారు. వారణాసి, హియర్ వి గో! అనే క్యాప్షన్‌తో ఆమె ఒక ఫోటోను పోస్ట్ చేయడంతో, కొత్త షెడ్యూల్ ప్రారంభమైనట్లు అధికారికంగా వెల్లడైంది. కొద్ది రోజుల క్రితం హైదరాబాద్‌లో నీటి కొరత కారణంగా తాత్కాలికంగా నిలిచిపోయిన షూటింగ్‌ను ఇప్పుడు పునఃప్రారంభించారు. తాజా అప్‌డేట్‌తో ఈ గ్లోబల్ యాక్షన్ అడ్వెంచర్ చిత్రంపై అంచనాలు మరింత పెరిగాయి. ఈ సినిమాలో మహేష్ బాబు సరసన ప్రియాంక చోప్రా నటిస్తుండగా, మలయాళ స్టార్ పృథ్వీరాజ్ సుకుమారన్ కీలక పాత్ర పోషిస్తున్నారు. వీరితో పాటు మాధవన్, ప్రకాష్ రాజ్ వంటి ప్రముఖ నటులు కూడా ముఖ్యమైన పాత్రల్లో కనిపించనున్నారు.




## దృశ్యం 3 తెలుగు ట్రైలర్ రిలీజ్

మోహన్ లాల్, మీనా ప్రధాన పాత్రల్లో నటించిన లేటెస్ట్ మూవీ దృశ్యం 3. ఇప్పటికే వచ్చిన దృశ్యం, దృశ్యం 2 రెండు సినిమాలు కూడా బంపర్ హిట్ కొట్టాయి. ఇక ఆ రెండు సినిమాలకు సీక్వెన్స్ గా ఇప్పుడు దృశ్యం 3 కూడా వస్తోంది. లేటెస్ట్ గా ఈ సినిమా తెలుగు ట్రైలర్ లాంచ్ చేశారు. జీతూ జోసెఫ్ దర్శకత్వంలో వచ్చిన ఈ సినిమా, ఈ నెల 21వ తేదీన థియేటర్స్ లో రిలీజ్ కానుంది. ఇందులో భాగంగానే ప్రమోషన్స్ మొదలు పెట్టింది చిత్ర బృందం. ఇటీవల మలయాళ ట్రైలర్ రిలీజ్ చేసిన చిత్ర బృందం... నేడు తెలుగులో కూడా విడుదల చేసింది. ఈ ఫ్రాంచైజీ లో వచ్చిన తొలి రెండు సినిమాలను విక్టరీ వెంకటేష్ తెలుగులో రీమేక్ చేశాడు. కానీ ఈ సారి పార్ట్ 3 మాత్రం రీమేక్ చేయకపోవడంతో ఒరిజినల్ వెర్షన్ నే తెలుగులోకి డబ్ చేసి రిలీజ్ చేస్తున్నారు. కాగా ఈ సినిమా రన్ టైం 2.39 గంటలుగా ఉంది. ఇక ఈ సినిమాను మలయాళం, తెలుగుతో పాటు తమిళం, కన్నడ భాషల్లో ఈ నెల 21వ తేదీన రిలీజ్ చేస్తున్నారు.

## చెన్నైలో పెళ్లి చేసుకుంటానో లేదో: శ్రీలీల

టాలీవుడ్ యంగ్ బ్యూటీ శ్రీలీల మరోసారి తన పర్సనల్ లైఫ్ గురించి చేసిన కామెంట్స్ తో సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారింది. ఇప్పటికే కెరీర్, చదువు, వ్యక్తిత్వంతో ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్న ఈ యంగ్ హీరోయిన్ తాజాగా చెన్నైలో జరిగిన ఓ ఈవెంట్‌లో పెళ్లిపై చేసిన కామెంట్స్ ఇప్పుడు వైరల్ అవుతున్నాయి. ముఖ్యంగా పెళ్లి గురించి శ్రీలీల చేసిన కామెంట్స్ ఫ్యాన్స్ లో కొత్త చర్చకు దారి తీశాయి. ప్రస్తుతం టాలీవుడ్ నుంచి బాలీవుడ్ వరకు నటీనటుల పెళ్లిళ్లు వరుసగా జరుగుతున్న నేపథ్యంలో శ్రీలీల వ్యాఖ్యలు మరింత ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. చెన్నైలోని అమృత ఏవియేషన్ కాలేజ్ ఈవెంట్ కు హాజరైన శ్రీలీల స్టూడెంట్స్ తో సరదాగా ముచ్చటించారు. ఈ సందర్భంగా ఆమెకు కోలీవుడ్ ఫ్యాన్స్ నుంచి మంచి రెస్పాన్స్ లభించింది. కాలేజ్ లోని స్టూడెంట్స్ శ్రీలీలను లేడీ సూపర్ స్టార్ అంటూ పిలవగా దానికి ఆమె వెంటనే రియాక్ట్ అవుతూ, ఆ ట్యాగ్‌కు అసలైన అర్హురాలు నయనతార అని చెప్పారు. నయనతార తనకు ఎంతో ఇష్టమైన నటి అని, ఆమె కెరీర్, వ్యక్తిత్వం తనకు ఇన్స్పిరేషన్ అని వెల్లడించారు.





## రాగిణి ఎంఎంఎస్3లో వెర్సటైల్‌గా తమన్నా


రాగిణి ఎంఎంఎస్3లో మిల్కీ బ్యూటీ తమన్నా నటిస్తుండటం అందరినీ ఆశ్చర్యానికి గురిచేస్తోంది. శశాంక్ ఘోష్ దర్శకత్వంలో ఏక్తా కపూర్ నిర్మించనున్న ఈ చిత్రంలో తమన్నా మోడ్రన్ అమ్మాయిగా– ఆత్మగా ద్విపాత్రాభినయం చేయనుందట. మునుపెన్నడూ లేని విధంగా అత్యంత బోల్డ్ అవతారంలో తమన్నా కనిపించనుందని.. అందాల ఆరబోత – పవర్‌ఫుల్ పెర్ఫార్మెన్స్ ఈ చిత్రానికి ప్రధాన ఆకర్షణగా నిలవనున్నాయని టాక్. ఆయుష్ శర్మ, జునైద్ ఖాన్ తదితరులు ఇందులో నటిస్తున్నారు. ముఖ్యంగా తమన్నా చేరికతో ఈ సినిమాపై అంచనాలు రెట్టింపయ్యాయి. తమన్నా వంటి అగ్ర కథానాయిక ఈ రేంజ్ బోల్డ్ ఫ్రాంచైజీని ఎంచుకోవడం నిజంగా కెరీర్‌లో ఒక కీలకమైన మలుపుగా భావించాలి.



## అదే నాకు సంతృప్తి

నటి శ్వేతా తివారీ కుమార్తెగా గుర్తింపు పొందిన పాలక్ తివారీ, తన తాజా వెబ్ సిరీస్ 'లుక్కే' గురించి ఆసక్తికరమైన విషయాలను పంచుకున్నారు. ఈ సిరీస్‌లో ఆమె పోషించిన 'సనోబర్' పాత్ర తన నిజ జీవితానికి చాలా దగ్గరగా ఉంటుందని, ఇప్పటివరకు తనపై ఉన్న గ్లామర్ ఇమేజ్‌ను ఈ పాత్ర చెరిపివేస్తుందని ఆమె ధీమా వ్యక్తం చేశారు. సోషల్ మీడియాలో తనను చూసి అందరూ ఒక గ్లామర్ బొమ్మలా అనుకుంటారని, కానీ అది కేవలం బ్రాండ్లను ప్రమోట్ చేయడానికి వేసుకున్న ముసుగు మాత్రమేనని పాలక్ అన్నారు. "సోషల్ మీడియాలో కనిపించే అమ్మాయి అసలు ఉందో లేదో కూడా నాకు తెలియదు. నిజ జీవితంలో నేను చాలా ఎమోషనల్. కుటుంబం కోసం పోరాడే రకం. 'లుక్కే' సిరీస్‌లో నాలోని అసలు మనిషికి దగ్గరగా ఉండే పాత్రను పోషించే అవకాశం దక్కింది" అని ఆమె చెప్పుకొచ్చారు. గ్లామర్ పాత్రలకే పరిమితం కాకుండా, తనలో మంచి నటి ఉందని నిరూపించుకోవడమే తన లక్ష్యమని తెలిపారు. తన తల్లి శ్వేతా తివారీ సినీ ఇండస్ట్రీలో ఎన్నో ఒడిదుడుకులను ఎదుర్కొన్నారని, ఆ కష్టాలను తాను కళ్లారా చూశానని పాలక్ గుర్తు చేసుకున్నారు.



# అక్షర్ కెప్టెన్ ఇన్నింగ్స్

**పంజాబ్‌పై ఢిల్లీ గెలుపు**

## ప్లే ఆఫ్స్ రేసులో.. సేఫ్ జోన్.. అయ్యర్ సేనకు నాలుగో ఓటమి

ఐపీఎల్ 2026లో వరుస విజయాలతో ప్లే ఆఫ్స్ దిశగా అడుగులు వేసిన పంజాబ్ కింగ్స్.. వరుసగా నాలుగో మ్యాచులో పరాజయం పాలైంది. సోమవారం ధర్మశాల వేదికగా ఢిల్లీ క్యాపిటల్స్‌తో జరిగిన మ్యాచులో 3 వికెట్ల తేడాతో ఓటమి చవిచూసింది. ఓడినా పాయింట్స్ టేబుల్‌లో మాత్రం టాప్-4లోనే కొనసాగుతోంది. మరోవైపు టోర్నీలో ఐదో విజయంతో ఢిల్లీ క్యాపిటల్స్ పాయింట్స్ టేబుల్‌లో ఏడో ప్లేసుకు చేరుకుంది. ప్లే ఆఫ్స్ అవకాశాలను సజీవంగా ఉంచుకుంది. ఈ మ్యాచులో తొలుత బ్యాటింగ్ చేసిన పంజాబ్ కింగ్స్.. నిర్ణీత 20 ఓవర్లలో 210/5 పరుగులు చేసింది. కెప్టెన్ శ్రేయస్ అయ్యర్ (59), ప్రియాన్ష్ ఆర్యా (56) హాఫ్ సెంచరీలు సాధించారు. భారీ లక్ష్యంతో బరిలోకి దిగిన ఢిల్లీ క్యాపిటల్స్ అనూహ్య విజయం అందుకుంది. టాప్ ఆర్డర్ బ్యాటర్లు విఫలమైనా.. మిగతా వారంతా తలా ఓ చేయి వేయడంతో విజయం సాధించింది. ఈ సీజన్‌లో ఇప్పటివరకు చెప్పుకోదగ్గ ప్రదర్శన చేయని కెప్టెన్ అక్షర్ పటేల్.. ఈ మ్యాచులో రాణించాడు. 30 బంతుల్లో 56 పరుగులు స్కోరు చేశాడు. డేవిడ్ మిల్లర్ సైతం 28 బంతుల్లో 51 రన్స్ చేసి.. డీసీని విజయం దిశగా తీసుకెళ్లాడు. అశుతోష్ శర్మ (10 బంతుల్లో 24 రన్స్), మాధవ్ తివారీ (8 బంతుల్లో 18 రన్స్ నాటౌట్), అకబ్ నబీ (2 బంతుల్లో 10 రన్స్) బ్యాట్ ఝుళిపించడంతో డీసీ సరిగ్గా 19 ఓవర్లలో 7 వికెట్లు కోల్పోయి లక్ష్యాన్ని ఛేజ్ చేసింది. ఈ విజయంతో మిణుకుమిణుకు మంటున్న ప్లే ఆఫ్స్ ఆశలను డీసీ సజీవంగా ఉంచుకుంది. డీసీ మిగిలిన రెండు మ్యాచులలో గెలిస్తే ఆ జట్టు ఖాతాలో 14 పాయింట్లు చేరనున్నాయి. అప్పుడు నెట్ రన్ రేట్ ఆధారంగా డీసీ ముందంజ వేసే అవకాశం ఉంది. మరోవైపు పంజాబ్ కింగ్స్.. ప్లే ఆఫ్స్‌కు ముందు అనూహ్యంగా తడబడుతోంది. తొలి ఏడు మ్యాచులలో పరాజయం ఎరుగని ఆ జట్టు.. ఆ తర్వాత వరుసగా నాలుగింట్లో ఓడిపోయింది. అయినా 13 పాయింట్లతో టేబుల్‌లో నాలుగో ప్లేసులో ఉంది.

**ఐపీఎల్ 2026 పాయింట్ల పట్టిక**

| జట్టు | ఆ | గె | ఓ | పా |
|---|---|---|---|---|
| బెంగళూరు | 11 | 7 | 4 | 14 |
| హైదరాబాద్ | 11 | 7 | 4 | 14 |
| గుజరాత్ | 11 | 7 | 4 | 14 |
| పంజాబ్ | 11 | 6 | 4 | 13 |
| చెన్నై | 11 | 6 | 5 | 12 |
| రాజస్థాన్ | 11 | 6 | 5 | 12 |
| ఢిల్లీ | 12 | 5 | 7 | 10 |
| కోల్‌కతా | 10 | 4 | 5 | 9 |
| ముంబై | 11 | 3 | 8 | 6 |
| లక్నో | 11 | 3 | 8 | 6 |

ఆ-ఆడినవి గె-గెలిచినవి ఓ-ఓడినవి పా-పాయింట్లు

## ఆర్సీబీ హెడ్ కోచ్‌కు జరిమానా

రాయల్ చాలెంజర్స్ బెంగళూరు(ఆర్సీబీ) హెడ్ కోచ్ ఆండీ ఫ్లవర్‌కు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ జరిమానా విధించింది. ఆదివారం ముంబై ఇండియన్స్‌తో జరిగిన మ్యాచ్ సమయంలో అసభ్య పదజాలం ఉపయోగించినందుకు అతని మ్యాచ్ ఫీజులో 15 శాతం ఫైన్ వేసింది. అసలేం జరిగిందంటే.. ఆర్సీబీ ఇన్నింగ్స్‌లో ఘజన్‌ఫర్ వేసిన 17వ ఓవర్‌లో రెండో బంతిని కృనాల్ పాండ్యా బంతిని గాల్లోకి లేపగా.. నమన్ ధీర్ బాల్‌ను అందుకోవడానికి ప్రయత్నించినా సమన్వయం కోల్పోయి బౌండరీ లైన్ దాటాడు. అప్పటికే బాల్‌ను తిలక్ విసరగా అతను అందుకోలేదు. అప్పుడు తిలక్..ధీర్ బౌండరీ లైన్‌ను తాకిందని భావించి సిక్సర్ సంకేతం ఇచ్చినట్టు కనిపించింది. కానీ, రీప్లేలో ధీర్ బౌండరీ రోప్‌ను తాకలేదని తేలింది. అయితే, కృనాల్ అది సిక్స్‌గా భావించి పరుగు తీయలేదు. దీంతో అసహనానికి గురైన ఫ్లవర్ ఫోర్త్ అంపైర్‌తో వాగ్వాదానికి దిగాడు. ఈ సమయంలోనే ప్రేక్షకులకు, వీక్షకులకు వినిపించేలా ఫ్లవర్ అసభ్యకరమైన పదజాలాన్ని వాడినట్టు ఐపీఎల్ గవర్నింగ్ కౌన్సిల్ గుర్తించింది. ఈ నేపథ్యంలోనే ఐపీఎల్ ప్రవర్తనా నియమావళిలోని ఆర్టికల్ 2.3 ప్రకారం.. అతనిపై చర్యలు తీసుకుంది.



## వినేశ్‌కు కష్టమే..!

భారత స్టార్ రెజ్లర్ వినేశ్ ఫొగట్ పునరాగమనంలో డ్రామా నెలకొంది. ఇటీవల భారత రెజ్లింగ్ సమాఖ్య(డబ్ల్యూఎఫ్ఐ) వినేశ్‌ను జూన్ 26 వరకు దేశీయ టోర్నీల్లో పాల్గొనడానికి అనర్హురాలుగా ప్రకటించింది. యాంటీ డోపింగ్ రూల్స్ ప్రకారం.. రిటైర్మెంట్ నుంచి తిరిగి వచ్చే అథ్లెట్లు ఆరు నెలలు నోటీసు కాలంలో ఉండాలని పేర్కొంది. అయితే, వినేశ్ మాత్రం ఉత్తరప్రదేశ్‌లోని గోండాలో జరుగుతున్న నేషనల్ ఓపెన్ ర్యాంకింగ్ టోర్నమెంట్‌లో పాల్గొనడానికి సిద్ధమైంది. మంగళవారం మహిళల ఫ్రీస్టైల్ పోటీలు జరగనుండగా.. సోమవారం ఆమె అయోధ్యకు చేరుకుంది. ఈ సందర్భంగా డబ్ల్యూఎఫ్ఐ షోకాజ్ నోటీసుపై ఆమె స్పందించింది. ఈ టోర్నీలో పాల్గొనేందుకు తాను అర్హురాలినేనని తెలిపింది. తన పునరాగమనం గురించి జూన్‌లోనే యునైటెడ్ వరల్డ్ రెజ్లింగ్(యూడబ్ల్యూడబ్ల్యూ)కు తెలియజేశానని, కాబట్టి, రిటైర్మెంట్ అథ్లెట్లకు సంబంధించిన వరల్డ్ యాంటీ డోపింగ్ ఏజెన్సీ కోడ్‌లోని 5.6.1 రూల్ తనకు వర్తించదని చెప్పింది. కానీ, డబ్ల్యూఎఫ్ఐ వర్గాలు మాత్రం ఆమెను టోర్నీలో పాల్గొనడానికి అనుమతి ఇచ్చేది లేదని చెబుతున్నాయి. భారత రెజ్లింగ్ సమాఖ్య తమ షోకాజ్ నోటీసులో వినేశ్ క్రమశిక్షణా రాహిత్యానికి పాల్పడిందని, డోపింగ్ నిబంధనలను ఉల్లంఘించిందని కూడా పేర్కొంది. తాజాగా వినేశ్ ఇచ్చిన వివరణ పట్ల డబ్ల్యూఎఫ్ఐ సంతృప్తి చెందలేదు. వినేశ్ కేవలం తన అర్హత అంశాన్ని మాత్రమే ప్రస్తావించిందని, క్రమశిక్షణా ఆరోపణలపై స్పందించలేదని డబ్ల్యూఎఫ్ఐ వర్గాలు తెలిపాయి. కాబట్టి, దీనిపై విచారణ జరిపి ఓ నిర్ణయం తీసుకునే వరకూ ఆమెను పోటీల్లో పాల్గొనడానికి అనుమతి ఇవ్వలేమని పేర్కొన్నాయి. పారిస్ ఒలింపిక్స్ ఫైనల్‌లో అనర్హత వేటు పడిన తర్వాత వినేశ్ రెజ్లింగ్‌కు రిటైర్మెంట్ ప్రకటించింది. ఆ తర్వాత తను వీడ్కోలు నిర్ణయాన్ని వెనక్కి తీసుకుంది.

## పోరాటానికి ఇవే సాక్ష్యాలు: కృనాల్

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆల్‌రౌండర్ కృనాల్ పాండ్యా, తనలోని పోరాట యోధుడిని మరోసారి ప్రపంచానికి పరిచయం చేశాడు. నిన్న ముంబై ఇండియన్స్ (ఎంఐ)తో జరిగిన మ్యాచ్‌లో అద్భుత ప్రదర్శనతో జట్టుకు విజయాన్ని అందించాడు. అనంతరం ఆ పోరాటంలో తనకు తగిలిన గాయాలను చూపిస్తూ సోషల్ మీడియాలో భావోద్వేగ పోస్ట్ పెట్టాడు. రాయ్‌పూర్ వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో 167 పరుగుల లక్ష్య ఛేదనలో కృనాల్ అసాధారణ పోరాట పటిమను ప్రదర్శించాడు. కఠినమైన పిచ్‌పై, కండరాల తిమ్మిర్లతో తీవ్రంగా బాధపడుతూనే క్రీజులో నిలబడ్డాడు. కేవలం 46 బంతుల్లో 4 ఫోర్లు, 5 సిక్సర్లతో 73 పరుగులు చేసి ఆర్సీబీకి చిరస్మరణీయ విజయాన్ని అందించాడు. మ్యాచ్ ముగిసిన తర్వాత కృనాల్ తన ఇన్‌స్టాగ్రామ్‌లో గాయాల తాలూకు ఫొటోలను పంచుకున్నాడు. "కొన్ని గాయాలు మనం పోరాడటానికి తగినవని నిరూపిస్తాయి" అంటూ క్యాప్షన్ జోడించాడు. ఈ పోస్ట్ ప్రస్తుతం వైరల్‌గా మారింది. ఇక, ఈ సీజన్‌లో కృనాల్ అద్భుతమైన ఫామ్‌లో ఉన్న విషయం తెలిసిందే. ఇప్పటివరకు ఆడిన ఆరు ఇన్నింగ్స్‌లలో 35.50 సగటు, 150.00 స్ట్రైక్ రేట్‌తో 141 పరుగులు సాధించి తన బ్యాటింగ్ సత్తాను చాటుతున్నాడు. అటు బౌలింగ్‌లోనూ అద్భుతంగా రాణిస్తున్నాడు.

## టిమ్ డేవిడ్‌పై చర్యలు?

రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు (ఆర్సీబీ) ఆల్‌రౌండర్ టిమ్ డేవిడ్ ఒక వివాదంలో చిక్కుకున్నాడు. తన పాత జట్టు ముంబై ఇండియన్స్ (ఎంఐ) పై ఉత్కంఠభరిత విజయం సాధించిన తర్వాత అతను అసభ్యకరమైన రీతిలో 'మిడిల్ ఫింగర్' సైగ చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటున్నాడు. ఇందుకు సంబంధించిన ఓ వీడియో సోషల్ మీడియాలో వైరల్ కావడంతో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. గతంలో మూడు సీజన్ల పాటు ముంబై ఇండియన్స్‌కు ప్రాతినిధ్యం వహించిన టిమ్ డేవిడ్‌ను, 2025 వేలంలో ఆర్సీబీ కొనుగోలు చేసింది. అప్పటి నుంచి అతను బెంగళూరు జట్టులో కీలక ఆటగాడిగా కొనసాగుతున్నాడు. అయితే, ముంబైతో జరిగిన ఈ మ్యాచ్‌లో అతను ఎదుర్కొన్న తొలి బంతికే డకౌట్‌గా వెనుదిరిగాడు. ఈ మ్యాచ్ చివరి బంతికి ఆర్సీబీ గెలవడంతో డగౌట్‌లో సంబరాలు అంబరాన్నంటాయి. చివరి ఓవర్లో 15 పరుగులు అవసరమైన దశలో, రొమారియో షెపర్డ్ ఔటవ్వడంతో ముంబై గెలుపు ఖాయమనిపించింది.



## ధర్మశాల వీధుల్లో అర్ష్‌దీప్ జంట

టీమిండియా యువ ఫాస్ట్ బౌలర్, పంజాబ్ కింగ్స్ ఆటగాడు అర్ష్‌దీప్ సింగ్ తన ప్రేమాయణంతో వార్తల్లో నిలిచాడు. తన ప్రియురాలిగా ప్రచారంలో ఉన్న నటి సమ్రీన్ కౌర్‌తో కలిసి ఆయన హిమాచల్ ప్రదేశ్‌లో పర్యటిస్తున్నాడు. ఇద్దరూ కలిసి ధర్మశాల వీధుల్లో చేతిలో చేయి వేసుకుని నడుస్తున్న వీడియోలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ఈ జంట తరచుగా కలిసి కనిపిస్తుండటంతో వీరి మధ్య ప్రేమాయణం నిజమేనని అభిమానులు భావిస్తున్నారు. తాజాగా బయటకు వచ్చిన వీడియోల్లో అర్ష్‌దీప్ ఫోన్‌లో మాట్లాడుతూ సమ్రీన్‌తో కలిసి నడుస్తున్నాడు. అయితే, ఓ వ్యక్తి తమను వీడియో తీయడాన్ని గమనించిన అర్ష్‌దీప్, వెంటనే వీడియో తీయడం ఆపమంటూ సైగ చేశాడు. మరో వీడియోలో ఇద్దరూ ధర్మశాలలోని ట్రాఫిక్‌లో సాధారణ వ్యక్తుల్లాగే నడుచుకుంటూ వెళ్లడం కనిపించింది. ఈ సమయంలో అర్ష్‌దీప్ ఎరుపు రంగు తలపాగా, బ్లూ టీషర్ట్, బ్రౌన్ ప్యాంట్ ధరించగా, సమ్రీన్ బ్లూ అండ్ వైట్ స్ట్రైప్డ్ టాప్, బ్లూ ప్యాంట్‌లో కనిపించింది. ఈ వీడియోలపై నెటిజన్లు భిన్నరకాలుగా స్పందిస్తున్నారు. ఎలాంటి సెక్యూరిటీ లేకుండా, ఆర్భాటాలకు దూరంగా వారు స్వేచ్ఛగా తిరగడాన్ని చాలామంది ప్రశంసించారు. "సెలబ్రిటీలు ఇంత స్వేచ్ఛగా తిరగడం ఒక్క హిమాచల్‌లోనే సాధ్యం" అని ఒకరు కామెంట్ చేయగా, "దయచేసి వారి ఏకాంతానికి భంగం కలిగించకండి" అని మరో యూజర్ కోరారు. "అభిమానుల్లో ఒకరు 'అర్ష్‌దీప్ భాయ్' అని గట్టిగా అరవనంత వరకే ఈ ప్రశాంతత" అంటూ ఓ నెటిజన్ సరదాగా వ్యాఖ్యానించాడు. ఐపీఎల్ సీజన్ సమయంలో కూడా ఈ జంట పలుమార్లు కలిసి కనిపించింది. అప్పుడు అర్ష్‌దీప్ చాలా బ్యాగులు మోస్తుండగా, సమ్రీన్ మాత్రం చేతిలో బోర్డింగ్ పాస్‌తో కనిపించడం చర్చనీయాంశమైంది.

## టీమిండియా నం.1

### ఐసీసీ వన్డే వార్షిక ర్యాంకింగ్స్




వన్డే వార్షిక ర్యాంకింగ్స్ జాబితాను ఐసీసీ తాజాగా విడుదల చేసింది. భారత జట్టు 118 రేటింగ్ పాయింట్లతో మరోసారి తన అగ్రస్థానాన్ని నిలబెట్టుకుంది. ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్ జాబితాలోనూ టీమిండియానే అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. టీ20 ప్రపంచ కప్ 2026 గెలవడంతో పొట్టి ఫార్మాట్‌లోనూ భారత్ పై చేయి సాధించింది. కాగా 2025 ఛాంపియన్స్ ట్రోఫీలో ఘన విజయం సాధించిన టీమిండియా.. తాజా వన్డే ర్యాంకింగ్స్‌లో తమ ఆధిపత్యాన్ని చాటింది. న్యూజిలాండ్ 113 పాయింట్లతో రెండో స్థానంలో ఉండగా.. 109 పాయింట్లతో ఆస్ట్రేలియా మూడో స్థానంలో కొనసాగుతోంది. అయితే భారత్ కంటే న్యూజిలాండ్ కేవలం 5 పాయింట్ల తేడాతోనే రెండో స్థానంలో ఉండటం విశేషం. అద్భుత ప్రదర్శనలతో వరుస విజయాలు సాధించిన సౌతాఫ్రికా 102 పాయింట్లతో నాలుగో స్థానానికి ఎగబాకింది. ఈ క్రమంలో పాకిస్థాన్(98)ను వెనక్కి నెట్టింది. ఇదిలా ఉంటే, ఇదొక్కటి తప్పించి టాప్ 10 జట్ల జాబితాలో ఎలాంటి మార్పు లేదు. శ్రీలంక(96), అఫ్గానిస్థాన్(93), ఇంగ్లండ్(89), బంగ్లాదేశ్(84), వెస్టిండీస్(74) పాయింట్లతో ఆ తర్వాతి స్థానాల్లో కొనసాగుతున్నాయి. ఐర్లాండ్ 54 పాయింట్లతో 11వ స్థానానికి చేరి జింబాబ్వేను వెనక్కి నెట్టింది. జింబాబ్వే 53 పాయింట్లతో 12వ స్థానానికి పడిపోయింది. మరోవైపు అమెరికా 46 పాయింట్లతో 13వ స్థానానికి ఎగబాకి స్కాట్లాండ్‌ను అధిగమించింది. స్కాట్లాండ్ ప్రస్తుతం 44 పాయింట్లతో 14వ స్థానంలో ఉంది. ఐసీసీ ప్రకటించిన నిబంధనల ప్రకారం 2027 మార్చి 31 నాటికి ఐసీసీ ర్యాంకింగ్స్‌లో టాప్ 8లో నిలిచే జట్లు నేరుగా వన్డే వరల్డ్ కప్ 2027కు అర్హత సాధిస్తాయి.

నేటి ఈవార్తలు

సంపాదకీయం Editorial

# చట్టం పెద్దోళ్ల చుట్టం

“చట్టం ముందు అందరూ సమానులే” అన్నది మన రాజ్యాంగం మనకు ప్రసాదించిన ప్రాథమిక హక్కు. కానీ, నేటి సామాజిక, రాజకీయ పరిస్థితులను గమనిస్తే ఈ నినాదం కేవలం పుస్తకాలకే పరిమితమవుతోందా అనే సందేహం కలుగుతోంది. సామాన్యుడికి ఒక న్యాయం, వీఐపీలకు మరో న్యాయం అన్నట్లుగా వ్యవస్థ తీరు మారడం ఆరోగ్యకరమైన ప్రజాస్వామ్యానికి గొడ్డలిపెట్టు. ఒక సామాన్యుడు చిన్న పొరపాటు చేసినా, అనుమానం వచ్చినా పోలీసులు వెంటనే స్పందించే తీరు అత్యంత వేగంగా ఉంటుంది. విచారణల పేరుతో వేధింపులు, అర్ధరాత్రి అరెస్టులు, క్షణాల్లో జైలు గోడల మధ్యకు నెట్టేయడం మనం నిత్యం చూస్తూనే ఉన్నాం. అక్కడ ‘చట్టం తన పని తాను చేసుకుపోతుంది’ అన్న మాట అక్షరాలా అమలవుతుంది. కానీ, అదే చట్టం ధనవంతులు, రాజకీయ పలుకుబడి ఉన్న ప్రముఖుల దగ్గరకు వచ్చేసరికి ఎందుకు కుంటుపడుతోంది? ఎందుకు ఆచితూచి అడుగులు వేస్తోంది? ప్రముఖులపై ఆరోపణలు వచ్చినప్పుడు వ్యవస్థలో ఒక రకమైన నిమ్మకు నీరెత్తిన చందనం కనిపిస్తుంది. నోటీసులు ఇవ్వడానికి వారాల సమయం, వివరణ కోరడానికి నెలల నిరీక్షణ, చివరికి అరెస్ట్ తప్పనిసరి అయితే అది కూడా అన్ని సౌకర్యాలతో కూడిన ఒక విలాసవంతమైన ప్రక్రియలా మారిపోతోంది. సాక్ష్యాధారాలు లభించడం లేదన్న సాకుతో విచారణను ఏళ్ల తరబడి సాగదీయడం ద్వారా అటు బాధితులకు న్యాయం అందకుండా పోవడమే కాకుండా, వ్యవస్థపై సామాన్యుడికి ఉన్న నమ్మకం సడలిపోతోంది. నేరం ఎవరూ చేసినా నేరమే. దానికి హోదాతో సంబంధం ఉండకూడదు. రాజ్యాంగం కల్పించిన రక్షణ కవచం అందరికీ సమానంగా వర్తించాలి. కానీ, నేడు డబ్బు, అధికారం ఉన్నవారు చట్టంలోని లొసుగులను వాడుకుంటూ తప్పించుకుంటుంటే, అమాయకపు సామాన్యులు న్యాయం కోసం కోర్టుల చుట్టూ కాళ్లు అరిగేలా తిరుగుతున్నారు. ప్రజాస్వామ్య వ్యవస్థలో న్యాయస్థానాలు, దర్యాప్తు సంస్థలు నిష్పక్షపాతంగా వ్యవహరించినప్పుడే వ్యవస్థపై గౌరవం పెరుగుతుంది. వ్యవస్థ నీరుగారిపోకుండా ఉండాలంటే, చట్టం తన ప్రతాపాన్ని కేవలం పేదవాడి మీదనే కాదు, తప్పు చేసిన ప్రతి ఒక్కరి మీద చూపాలి. చట్టం కళ్లు కమ్మేయకూడదు, చట్టం చేతులు కట్టిపడి ఉండొద్దు. ప్రముఖులకు ఇచ్చే అతిథి మర్యాదలు పక్కన పెట్టి, నేరస్తులుగానే వారిని పరిగణించినప్పుడే సమాజంలో సమానత్వం సాధ్యమవుతుంది. లేదంటే, ఈ వ్యవస్థ కేవలం “బలవంతుడిదే భూమి.. ధనవంతుడిదే న్యాయం” అన్న అరాచకత్వానికి దారి తీస్తుంది. న్యాయ వ్యవస్థ తన విశ్వసనీయతను కాపాడుకోవాల్సిన తరుణం ఇది. చట్టం అందరినీ సమానంగా చూసినప్పుడే ‘ప్రజాస్వామ్యం’ అన్న మాటకు పరిపూర్ణమైన అర్థం లభిస్తుంది.

# భారత్ ఆర్థిక స్వావలంబన




కోవిడ్-19 మహమ్మారి తర్వాత ప్రపంచ ఆర్థిక వ్యవస్థ పూర్తిగా మారిపోయింది. 2020 నుంచి 2023 వరకు ప్రపంచ దేశాలు ఆరోగ్య సంక్షోభం, సరఫరా వ్యవస్థల విఘాతం, రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, మధ్యప్రాచ్య ఉద్రిక్తతలు, ఇంధన కొరత, ఆహార భద్రత సమస్యలు వంటి అనేక సవాళ్లను ఎదుర్కొన్నాయి. భారతదేశం కూడా ఈ ప్రభావం నుంచి మినహాయింపు పొందలేదు. ప్రపంచీకరణపై ఆధారపడిన ఆర్థిక వ్యవస్థల్లో సరఫరా గొలుసులు తెగిపోవడం వల్ల పెట్రోల్, డీజిల్, వంటనూనెలు, రసాయనిక ఎరువులు, ఎలక్ట్రానిక్ వస్తువులు, బంగారం వంటి అనేక దిగుమతి ఉత్పత్తుల ధరలు పెరిగాయి. ఈ నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పలు సందర్భాల్లో స్వదేశీ వినియోగం, రసాయన ఎరువుల తగ్గింపు, ఇంధన పొదుపు, డిజిటల్ విధానాల ప్రాధాన్యత గురించి దేశ ప్రజలకు పిలుపునిచ్చారు.



డాక్టర్ రక్కిరెడ్డి ఆదిరెడ్డి
కాకతీయ విశ్వవిద్యాలయం

భారతదేశం ప్రపంచంలో 3వ అతిపెద్ద చమురు దిగుమతి దేశం. దేశ అవసరాల్లో సుమారు 85% ముడి చమురు విదేశాల నుంచే దిగుమతి అవుతోంది. 2022లో రష్యా-ఉక్రెయిన్ యుద్ధం ప్రారంభమైన తర్వాత అంతర్జాతీయ మార్కెట్లో క్రూడ్ ఆయిల్ ధరలు బ్యారెల్‌కు వి120 వరకు చేరుకున్నాయి. దీని ప్రభావంగా భారతదేశంలో పెట్రోల్, డీజిల్ ధరలు గణనీయంగా పెరిగాయి. రవాణా ఖర్చులు పెరగడంతో నిత్యావసర వస్తువుల ధరలు కూడా అధికమయ్యాయి. భారత రిజర్వ్ బ్యాంక్ గణాంకాల ప్రకారం 2022లో ద్రవ్యోల్బణం 7% సమీపానికి చేరింది. ఈ పరిస్థితుల్లో ఇంధన వినియోగాన్ని తగ్గించడం దేశ ఆర్థిక భద్రతకు అవసరమనే అభిప్రాయం బలపడింది. వ్యవసాయ రంగం కూడా తీవ్రమైన ఒత్తిడిని ఎదుర్కొంది. భారతదేశం ప్రతి సంవత్సరం లక్షల టన్నుల యూరియా, డీఏపీ, పొటాష్ వంటి రసాయనిక ఎరువులను దిగుమతి చేసుకుంటోంది. ముఖ్యంగా రష్యా, చైనా, బెలారస్ వంటి దేశాలపై ఆధారపడటం వల్ల యుద్ధ పరిస్థితుల్లో ఎరువుల సరఫరా ప్రభావితమైంది. 2022లో ఎరువుల ధరలు 30% నుంచి 70% వరకు పెరిగాయి. కేంద్ర ప్రభుత్వం భారీ సబ్సిడీలు ఇచ్చినా రైతులకు సరఫరాలో సమస్యలు ఎదురయ్యాయి. ఈ నేపథ్యంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించి సేంద్రీయ వ్యవసాయం వైపు వెళ్లాలని ప్రధాని మోడీ 2019 స్వాతంత్ర్య దినోత్సవ ప్రసంగంలో రైతులకు పిలుపునిచ్చారు. కనీసం 10% నుంచి 25% వరకు రసాయన వినియోగం తగ్గించాలని సూచించారు. భారతదేశ భూసారం క్షీణత కూడా ఒక ప్రధాన సమస్యగా మారింది. భారత వ్యవసాయ పరిశోధనా మండలి నివేదికల ప్రకారం దేశంలో సుమారు 30% భూమి పోషక విలువలు కోల్పోయే ప్రమాదంలో ఉంది. అధిక రసాయన వినియోగం వల్ల భూసారం తగ్గిపోవడం, నీటి కాలుష్యం పెరగడం, రైతుల ఉత్పత్తి వ్యయం అధికమవడం జరుగుతోంది. అందుకే ప్రకృతి వ్యవసాయం, సేంద్రీయ పద్ధతులు, నానో యూరియా వంటి ప్రత్యామ్నాయాలపై ప్రభుత్వం దృష్టి పెట్టింది. 2022లో “వన్ నేషన్ - వన్ ఫర్టిలైజర్” విధానాన్ని కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టడం కూడా ఇదే దిశలో ఒక చర్యగా పరిగణించబడింది.

బంగారం కొనుగోళ్ల విషయంలో కూడా భారతదేశం ప్రపంచంలో అగ్రస్థానంలో ఉంది. ప్రతి సంవత్సరం భారతీయులు సుమారు 700 నుంచి 900 టన్నుల బంగారం కొనుగోలు చేస్తున్నారని ప్రపంచ గోల్డ్ కౌన్సిల్ నివేదికలు సూచిస్తున్నాయి. బంగారం దిగుమతుల వల్ల దేశ విదేశీ మారక నిల్వలపై ఒత్తిడి పెరుగుతోంది. 2015లో ప్రధాని మోడీ ప్రజలు బంగారం కొనుగోలు తగ్గించి బ్యాంకుల్లో పొదుపులు పెంచాలని సూచించారు. దీనివల్ల దేశ ఆర్థిక వ్యవస్థలో పెట్టుబడులు పెరుగుతాయని ఆయన అభిప్రాయపడ్డారు. కోవిడ్ తర్వాత “వర్క్ ఫ్రమ్ హోమ్” విధానం ప్రపంచవ్యాప్తంగా విస్తరించింది. 2021లో భారత ఐటీ రంగంలో సుమారు 70% ఉద్యోగులు ఇంటి నుంచే పనిచేసినట్లు పలు అధ్యయనాలు తెలిపాయి. దీని వల్ల కార్యాలయ వ్యయాలు తగ్గాయి, ట్రాఫిక్ తగ్గింది, ఇంధన వినియోగం తగ్గింది. డిజిటల్ సమావేశాల వల్ల విమాన ప్రయాణాలు కూడా తగ్గాయి. 2020 నుంచి 2022 మధ్య కాలంలో వీడియో కాన్ఫరెన్సింగ్ వినియోగం 300% కంటే ఎక్కువగా పెరిగింది. ఈ మార్పులు దేశానికి ఇంధన పొదుపులో కొంత సహాయపడ్డాయి. విదేశీ ప్రయాణాల తగ్గింపు కూడా ఆర్థిక దృష్ట్యా కీలక అంశంగా మారింది. ప్రతి సంవత్సరం కోట్లాది భారతీయులు విదేశీ పర్యటనలకు వెళుతున్నారు. కోవిడ్ తర్వాత విదేశీ మారక వినియోగం పెరగడంతో దేశ ఆర్థిక వ్యవస్థపై ఒత్తిడి పెరిగింది. దీనికి ప్రత్యామ్నాయంగా దేశీయ పర్యాటకాన్ని ప్రోత్సహించాలనే అభిప్రాయం బలపడింది. “వొకల్ ఫర్ లోకల్” నినాదం ద్వారా దేశీయ ఉత్పత్తుల వినియోగానికి కేంద్ర ప్రభుత్వం ప్రాధాన్యం ఇచ్చింది.




మొత్తంగా చూస్తే కోవిడ్ తర్వాత ప్రపంచ పరిస్థితులు భారతదేశానికి ఒక హెచ్చరికగా మారాయి. విదేశీ ఆధారాన్ని తగ్గించకుండా భవిష్యత్తులో ఆర్థిక భద్రత సాధ్యం కాదనే భావన బలపడింది. ఇంధన పొదుపు, స్వదేశీ ఉత్పత్తుల వినియోగం, రసాయన ఎరువుల తగ్గింపు, డిజిటల్ విధానాల ప్రోత్సాహం, ఎలక్ట్రిక్ వాహనాల వినియోగం వంటి అంశాలు కేవలం తాత్కాలిక సూచనలు కాదు. ఇవి భవిష్యత్ భారత ఆర్థిక నిర్మాణానికి సంబంధించిన వ్యూహాత్మక మార్పులు. ప్రజలు, రైతులు, పరిశ్రమలు, ప్రభుత్వాలు కలిసి పనిచేస్తే భారతదేశం స్వావలంబన దిశగా వేగంగా ముందుకు వెళ్లే అవకాశాలు స్పష్టంగా కనిపిస్తున్నాయి. ప్రపంచ ఆర్థిక వ్యవస్థలో చోటుచేసుకుంటున్న మార్పులు భారతదేశ విధానాలపై ప్రత్యక్ష ప్రభావం చూపిస్తున్నాయి. ముఖ్యంగా 2020 తర్వాత గ్లోబల్ సరఫరా వ్యవస్థలు పూర్తిగా దెబ్బతిన్నాయి. ఒక దేశంలో ఉత్పత్తి ఆగిపోతే ప్రపంచవ్యాప్తంగా వస్తువుల కొరత ఏర్పడే పరిస్థితి కనిపించింది. చైనాలో కరోనా లాక్‌డౌన్‌లు అమలైన సమయంలో ఎలక్ట్రానిక్ పరికరాలు, ఔషధ ముడి పదార్థాలు, యంత్ర సామగ్రి, ఎరువులు వంటి అనేక ఉత్పత్తుల సరఫరా తగ్గిపోయింది. భారతదేశం కూడా చైనా దిగుమతులపై అధికంగా ఆధారపడటం వల్ల పరిశ్రమల ఉత్పత్తి దెబ్బతింది. 2021లో భారత పారిశ్రామిక రంగంలో ముడి పదార్థాల కొరత కారణంగా కొన్ని రంగాల్లో ఉత్పత్తి 15% వరకు తగ్గిందని పరిశ్రమల సంఘాల నివేదికలు పేర్కొన్నాయి. ఈ పరిణామాలు దేశీయ తయారీ అవసరాన్ని మరింత బలంగా గుర్తు చేశాయి. “ఆత్మనిర్భర్ భారత్” కార్యక్రమం ఈ నేపథ్యంలోనే కేంద్ర ప్రభుత్వం ప్రారంభించింది. 2020లో ప్రకటించిన ఈ కార్యక్రమం విలువ సుమారు □20 లక్షల కోట్లుగా ప్రకటించబడింది. దేశీయ పరిశ్రమలు బలోపేతం కావడం, చిన్న మధ్య తరహా పరిశ్రమలకు రుణాలు అందించడం, స్థానిక ఉత్పత్తులను ప్రోత్సహించడం దీని ప్రధాన లక్ష్యాలుగా పేర్కొన్నారు. దేశంలో తయారీ రంగం జీడీపీలో ప్రస్తుతం సుమారు 16% వరకు మాత్రమే ఉండగా, దీన్ని 25% స్థాయికి తీసుకెళ్లాలని కేంద్ర ప్రభుత్వం లక్ష్యంగా పెట్టుకుంది. ప్రపంచ యుద్ధ పరిస్థితులు, అంతర్జాతీయ ఆర్థిక ఒత్తిడులు, దిగుమతుల ఖర్చులు పెరగడం వంటి పరిస్థితుల్లో దేశీయ ఉత్పత్తి సామర్థ్యం పెరగకపోతే భవిష్యత్తులో మరింత సంక్షోభం ఏర్పడే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు హెచ్చరిస్తున్నారు. ఇంధన రంగంలో భారత్ ఎదుర్కొంటున్న సమస్యలు కూడా అత్యంత కీలకమైనవి. అంతర్జాతీయ ఎనర్జీ ఏజెన్సీ గణాంకాల ప్రకారం భారతదేశం ప్రపంచంలో అత్యంత వేగంగా పెరుగుతున్న ఇంధన వినియోగ దేశాలలో ఒకటి. 2030 నాటికి భారతదేశ ఇంధన అవసరాలు ప్రస్తుత స్థాయి కంటే దాదాపు 35% పెరిగే అవకాశం ఉందని అంచనాలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో పెట్రోల్, డీజిల్ వినియోగాన్ని తగ్గించకపోతే దిగుమతి బిల్లు భారీగా పెరిగే ప్రమాదం ఉంది. 2022-23 ఆర్థిక సంవత్సరంలో భారత్ చమురు దిగుమతులపై వి157 బిలియన్ కంటే ఎక్కువ ఖర్చు చేసింది. ఈ మొత్తం దేశ ఆర్థిక వ్యవస్థపై భారీ ఒత్తిడిని సృష్టించింది. కోవిడ్-19 తర్వాత ప్రపంచ వ్యవస్థ పూర్తిగా మారిపోయిందనే విషయం స్పష్టంగా అర్థమవుతోంది. ఒకప్పుడు ప్రపంచీకరణను అభివృద్ధికి ప్రధాన ఆయుధంగా భావించిన దేశాలు ఇప్పుడు స్వదేశీ ఉత్పత్తి, స్థానిక సరఫరా వ్యవస్థలు, ఆర్థిక స్వావలంబన వైపు మళ్లుతున్నాయి. రష్యా-ఉక్రెయిన్ యుద్ధం, ఇంధన సంక్షోభం, ఆహార కొరత, సముద్ర రవాణా సమస్యలు, అంతర్జాతీయ రాజకీయ ఉద్రిక్తతలు ప్రపంచ దేశాలకు ఒక పెద్ద హెచ్చరికగా మారాయి. భారతదేశం కూడా ఈ పరిణామాల ప్రభావాన్ని తీవ్రంగా అనుభవించింది. పెట్రోల్, డీజిల్ ధరలు పెరగడం వల్ల రవాణా రంగం నుంచి వ్యవసాయం వరకు ప్రతి రంగంపైనా ప్రభావం పడింది. రసాయనిక ఎరువుల కొరత రైతులను ఆందోళనకు గురిచేసింది. వంటనూనెల ధరల పెరుగుదల మధ్యతరగతి కుటుంబాల ఆర్థిక పరిస్థితిని దెబ్బతీసింది. విదేశీ దిగుమతులపై అధిక ఆధారపడటం వల్ల దేశ ఆర్థిక భద్రత ఎంత ప్రమాదంలో పడుతుందో ఈ సంక్షోభాలు స్పష్టంగా చూపించాయి. ఈ పరిస్థితుల్లో దేశ ప్రజలు పాటించాల్సిన 9 నియమాల వెనుక ఉన్న ఆలోచన కేవలం ఖర్చు తగ్గింపు కాదు. ఇది దేశ భవిష్యత్తు ఆర్థిక భద్రతకు సంబంధించిన ఒక సమగ్ర వ్యూహం. వ్యవసాయ రంగంలో రసాయనిక ఎరువుల వినియోగాన్ని తగ్గించడం ద్వారా భూసారం కాపాడుకోవచ్చు. రైతుల ఉత్పత్తి వ్యయం తగ్గించవచ్చు. నీటి కాలుష్యం తగ్గే అవకాశం ఉంటుంది. సేంద్రీయ ఉత్పత్తులకు ప్రపంచవ్యాప్తంగా పెరుగుతున్న డిమాండ్ వల్ల భారతీయ రైతులకు కొత్త మార్కెట్లు అందుబాటులోకి రావచ్చు. ప్రస్తుతం యూరప్, అమెరికా వంటి దేశాల్లో ఆర్గానిక్ ఆహార మార్కెట్ విలువ వేగంగా పెరుగుతోంది. భారతదేశం ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుంటే వ్యవసాయ ఎగుమతుల్లో గణనీయమైన వృద్ధి సాధించగలదు. చివరగా చెప్పాలంటే దేశ ప్రజలు పాటించాల్సిన 9 నియమాలు తాత్కాలిక ఆంక్షలు కాదు. భవిష్యత్తు భారతదేశ నిర్మాణానికి సంబంధించిన మార్గదర్శక సూత్రాలుగా చూడాలి. స్వదేశీ ఉత్పత్తి, ఇంధన పొదుపు, ఆరోగ్యకర జీవనశైలి, ప్రకృతి పరిరక్షణ, డిజిటల్ అభివృద్ధి, స్థానిక పరిశ్రమల బలోపేతం వంటి అంశాలు సమన్వయంతో ముందుకు సాగితే భారతదేశం ప్రపంచ ఆర్థిక శక్తిగా ఎదగడానికి బలమైన పునాది ఏర్పడుతుంది. ప్రపంచ సంక్షోభాలను అవకాశాలుగా మలుచుకునే సామర్థ్యం భారతదేశానికి ఉంది. ప్రజలు చైతన్యంతో ముందుకు వస్తే “ఆత్మనిర్భర్ భారత్” అనే లక్ష్యం కేవలం నినాదంగా కాకుండా వాస్తవ రూపం దాల్చే అవకాశం స్పష్టంగా కనిపిస్తోంది.

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..

అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
‘ప్రజావాణి’ వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి ‘ఈవార్తలు’ పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by **BOMMAKANTI SHRAVAN KUMAR** from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by **BOMMAKANTI SHRAVAN KUMAR** and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. PRGI REGD No.: TGTEL/25/A1385 . Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.